

10 ఆసుపత్రుల్లో ఆగిన ఎన్టీఆర్ వైద్య సేవలు

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ (ఆశా) పిలుపు మేరకు ఎన్టీఆర్ వైద్యసేవ కింద జిల్లాలోని ఎన్టీఆర్ నెట్‌వర్క్ ఆసుపత్రులలో శుక్రవారం వైద్య చికిత్సలు ఆగిపోయాయి. జిల్లాలో 32 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా 10 ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవలు పూర్తిగా ఆగిపోయాయి. కాగా, ఎన్టీఆర్ వైద్య సేవలు ఆపేసిన ఆసుపత్రులకు వచ్చే రోగులను ఆ పథకం మిత్రాలు అందుబాటులో ఉన్న మరో నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్లేలా ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ సుధీర్‌కుమార్ చర్యలు తీసుకున్నారు.



గోశాలలో ఎడ్లను పరిశీలిస్తున్న చంద్రబాబు



సరస్వతీ నమస్తుభ్యం.. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో సీఎం





ప్లాంట్‌లో కార్మికులకు అభివాదం చేస్తూ..



ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



ఇప్పుడు కొన్ని
త్వరలో మరిన్ని...

- భారీగా నెల్లూరుకు ప్రాజెక్టులు
- వరంగా మూడు పోర్టులు, మూడు ఎయిర్‌పోర్టులు
- భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా నీటి నిల్వలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విశ్వ సముద్ర బయో ఇథనాల్ ప్లాంటు ప్రారంభించిన సీఎం
- విద్యార్థులతో ఆహ్లాదకరంగా ముచ్చటింపు

నెల్లూరు/వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి దిశగా నెల్లూరు జిల్లా దూసుకెళుతోందని, ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులతోపాటు త్వరలో అనేక ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో నిర్మించిన విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌తో పాటు చింతా శశిధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన నందగోకులం లైఫ్ స్కూల్, నంది పవర్ బుల్ (గోశాల) ప్రాజెక్టులను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. 'అద్భుతమైన సోమశిల, కండలేరు జలాశయాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. కండలేరు జలాశయాన్ని నిర్మించడంతోపాటు సోమశిల జలాశయం సామర్థ్యాన్ని పెంచిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుంది. ఈ రెండు జలాశయాల్లో దాదాపు 150 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఇంతటి అవకాశం మరే జిల్లాలోనూ లేదు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా ఈ రెండింటిలో నీటి నిల్వలు ఉంచుతాం. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టు ఉండగా, మరోవైపు రామాయపట్నం పోర్టు నిర్మాణం జరుపుకుంటోంది. త్వరలోనే దుగరాజపట్నం పోర్టు కూడా రాబోతోంది. అలానే చుట్టు పక్కల తిరుపతి, చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉండగా, త్వరలో దగదర్తి విమానాశ్రయం నిర్మాణం కాబోతోంది. ఓ వైపు జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉండగా, మరోవైపు రైల్వే సౌకర్యం ఉంది. హైదరాబాద్-చెన్నై మధ్య బుల్లెట్ ట్రైన్ నిర్మాణానికి కేంద్రం సిద్ధమవుతోంది. రామాయపట్నంలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, సర్వేపల్లిలో క్రిబ్కో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. ఇటువంటి నెల్లూరు జిల్లాలో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నూకల ద్వారా బయో ఇథనాల్ తయారు చేసే ప్రక్రియలో రైతులకు మేలు చేయడమే కాక పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న చింతా శశిధర్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

● మూడు ప్రారంభోత్సవాలు

ఈదగాలి గ్రామంలో నందగోకులం లైఫ్ స్కూల్‌లోని నవనీతం బ్లాక్‌ను సీఎం ప్రారంభించి స్కూల్‌ను

- మిగతా 7లో..





విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, పాల్గొన్న ప్రముఖులు

విన్నపాలు వినవలె!

అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం సీఎంకు ప్రముఖుల అర్జీలు 8



ఊరిపోవద్దు!

ప్రమాదకరంగా మారుతున్న ఊబకాయం

అనేక వ్యాధులకు ఇది మరో కారణం

జిల్లా జనాభాలో 30 శాతం వీరే

నేడు ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినం

ఊబకాయం... అవసరానికి మించిన బరువు, అధిక కొవ్వు... ప్రసుతం ఎంతో మందిని వేధిస్తున్న సమస్య ఇది. చిన్న పిల్లలు మొదలు పెద్ద వారి వరకూ అందరూ భారీ కాయంతో అవస్థ పడుతున్నారు. కొందరు జన్యుపరమైన సమస్యలతో ఇలా మారుతున్నప్పటికీ ఎక్కువ మంది మాత్రం జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడి ఊబకాయాన్ని ఊబిలో కూరుకుపోతున్నారు. ఇతర ఎన్నో ఆరోగ్య సమస్యలకు ఇది హేతువై చిన్న వయసులోనే రోగగ్రస్తులుగా మారుస్తోంది. ఆహార నియమాలు, నియంత్రణ, వ్యాయామమే దీనికి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు.

- సమగ్ర కథనం 8లో...

తాజాగా తిరుపతి పీడీ దయాకర్ సస్పెన్షన్

హౌసింగ్‌లో కదులుతున్న
అక్రమార్కుల డొంక

హౌసింగ్ శాఖలో అక్రమాల పుట్ట బద్ధలవుతోంది. వైసీపీ హయాంలో సిమెంటు, స్టీలు పక్కదారి పట్టించడమేగాక ఇళ్లు స్టేజీ దాటకపోయినా కాంట్రాక్టర్లకు బిల్లులు కట్టబెట్టారు. ఈ వ్యవహారాల్లో ఇప్పటికే పలువురు ఏఈలు సస్పెండ్ అవగా తాజాగా ఓ ఉన్నతాధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుతం తిరుపతిలో ఇన్‌చార్జ్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దయాకర్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అమరావతి/నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ (ఇన్‌ఛార్జి) పి.దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఈఈగా, ఈఈగా పనిచేసినప్పుడు కొండ్లపూడి, వెంకటేశ్వరపురం లే-అవుట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టేట్ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడి, హౌసింగ్ కార్పొరేషన్ ఖజానాకు రూ.కోట్లలో నష్టం కల్గించారని, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో కూడా విఫలమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో దయాకర్‌పై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్‌తోపాటు లే అవుట్లలో అవినీతి కార్యకలాపాల్లో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజినీరు పసుపులేటి సురేష్‌కుమార్ (రిటైర్డ్), గొల్లపూడి రామకృష్ణ (రాపూరు), ఎ.నాగరాజు (అప్పటి డివిజన్ హెడ్-రిటైర్డ్), ఎం.వెంకటమోహనరావు (ప్రస్తుత నెల్లూరు డివిజన్ హెడ్), పల్లా వెంకటదాసు (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్ - కర్నూలు జిల్లాలో పదవీ విరమణ చేశారు), పరవస్తు నరసింహం (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్-రిటైర్డ్), తోట వెంకటశేషయ్య (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్), మొహమ్మద్ జహీరుద్దీన్ అహ్మద్ (ప్రస్తుతం సర్వేపల్లి రూరల్ సబ్ డివిజన్ డీఈఈ), పటాన్ అహ్మద్‌బాషా, (రిటైర్డ్ ఏఈ), తాళ్లూరు భాస్కరరావు (ప్రస్తుతం మనుబోలు మండల ఏఈ), ఎం.మధుసూధనరావు (అప్పటి ఏఈ-ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు), ఎం.కృష్ణారెడ్డి (రిటైర్డ్ ఏఈ)లపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి అదనపు చెల్లింపుల మొత్తాన్ని తిరిగి రాబట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని ఆదేశిస్తూ లేఖ రాశారు.

> **గతంలో నెల్లూరులో ఈఈగా పని చేసిన అధికారి**
>
> **నాడు రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం**
>
> **మరో 12 మంది కిందిస్థాయి అధికారులపై చర్యలకు సిఫార్సు**



● దయాకర్ లీలలు ఇవీ..

గతంలో దయాకర్ నెల్లూరులో డీఈగా పనిచేస్తూ ఇన్‌చార్జ్ ఈఈగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కొందరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారికి ఇష్టానుసారం బిల్లులు చెల్లించారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2022లోనే హౌసింగ్ విజిలెన్స్ విభాగం కొండ్లపూడి గోదాములో తనిఖీలు చేపట్టగా భారీగా సిమెంటు, స్టీలు పక్కదారి పట్టినట్లు గుర్తించింది. ఈ ఒక్క వ్యవహారంలోనే దయాకర్ మూలంగా రూ.1.50 కోట్ల వరకూ ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని విజిలెన్స్ విభాగం నివేదిక ఇచ్చింది. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత మరికొన్ని ఫిర్యాదులు కూడా రాష్ట్ర హౌసింగ్ కార్యాలయానికి అందినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. అయితే ఇటీవల ఈ ఫిర్యాదులపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. గత నెలలో రాష్ట్రస్థాయి అధికారులు విచారించి నివేదిక అందజేయడంతో దయాకర్‌పై వేటు వేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

రూపాయి చెల్లించకుండానే
రూ.లక్షల్లో పరిహారం



● గ్యాస్ సిలిండర్ ప్రమాదం జరిగితే ఇంటిల్లిపాదికీ బీమా

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒక్క రూపాయి చెల్లించకుండానే అనుకోని ప్రమాదం జరిగినప్పుడు గ్యాస్ వినియోగదారులు రూ.30 లక్షల వరకు పరిహారం పొందవచ్చు. అయితే, జిల్లా పౌరసరఫరాల శాఖ, గ్యాస్ కంపెనీల నిర్వాహకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవటంతో పరిహారం పొందలేక ఎందరో బాధితులు నష్టపోతున్నారు. వంట గ్యాస్ ప్రతి ఇంటా తప్పనిసరి అయ్యింది. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగిన ఆస్తినష్టంతోపాటు ప్రాణాలూ కోల్పోవచ్చు. గ్యాస్ సిలిండర్ ప్రమాదాలు జరిగినప్పుడు ఆయిల్ కంపెనీలు తీసుకునే పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా బాధితులకు పరిహారం అందుతుంది. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నప్పుడు పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా ఈ బీమా వర్తిస్తుంది.

● పరిహారం పొందాలంటే..

గ్యాస్ సిలిండర్ ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే సమీప పోలీసు స్టేషన్, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారం అందించాలి. వారు వచ్చి విచారిస్తారు. సిలిండర్ పేలడంతో ప్రమాదం సంభవించినట్లు నిర్ధారిస్తే సంబంధిత డిస్ట్రిబ్యూటర్ ఆయిల్ కంపెనీకి, బీమా సంస్థలకు విషయం తెలియచేస్తారు. పరిహారం పొందేందుకు మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం నివేదిక, వైద్య బిల్లులు, రశీదులు ఇవ్వాల్సి ఉంటుంది.

● పరిహారం ఇలా..

సిలిండర్ ప్రమాదం సంభవించి ఆస్తి నష్టం వాటిల్లితే రూ.2 లక్షల వరకు బీమా పొందవచ్చు. అలాగే, గాయపడిన ఒక్కో సభ్యుడికి రూ.2 లక్షలు, తక్షణ సాయం కింద రూ.25 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.6 లక్షలు పరిహారంగా వస్తుంది. ఇలా కుటుంబ మొత్తానికి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు బీమా వర్తిస్తుంది.

అక్రమ మ్యుటేషన్లపై ప్రభుత్వం సీరియస్

● పలువురు తహసీల్దార్లపై చార్జస్ ఫ్రేమ్

నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మ్యుటేషన్లు చేసిన వ్యవహారాలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. చేజర్ల మండలంలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ మ్యుటేషన్లపై విచారణకు ఆదేశించింది. ఇందుకు బాధ్యులైన అప్పటి తహసీల్దార్లపై చార్జస్ ఫ్రేమ్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 జూలై తర్వాత చేజర్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇష్టానుసారం మ్యుటేషన్లు జరిగాయి. కొందరు తహసీల్దార్లు ప్రభుత్వ భూములను కూడా మరొకరి పేర్లపైకి ఎక్కించి ధారాదత్తం చేశారు. పెళ్లూరు, నెర్నూరు, పాడేరు, చిత్తలూరు గ్రామాల్లో జరిగిన వ్యవహారాలపై అప్పట్లోనే ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం.. అక్రమ మ్యుటేషన్లు చేసిన అధికారులపై చర్యలకు పూనుకుంది. అప్పట్లో పనిచేసిన తహసీల్దార్లు ఎంవీకే సుధాకర్‌రావు (ప్రస్తుతం రిటైర్డ్), ఎం శ్యాంసుందరరాజ (ప్రస్తుతం రిటైర్డ్), బీ శివకృష్ణయ్య (ప్రస్తుతం పొదలకూరు తహసీల్దార్), ఎస్ చంద్రశేఖర్ (ప్రస్తుతం గూడూరు తహసీల్దార్)లతో పాటు వీఆర్వో కొమ్మి రాజాలపై ఆర్టికల్ ఆఫ్ చార్జస్ ఫ్రేమ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పది రోజుల్లో ఈ అధికారులు తమ సంజాయిషీను సమర్పించాలని, లేని పక్షంలో అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో
ఇద్దరికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్)/సూళ్లూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 2019 నాటి గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. సూళ్లూరుపేట బొగ్గుల కాలనీకి చెందిన తిరువళ్లూరు నవీన్‌కుమార్, సాయినగర్‌కు చెందిన కేకుల దేవకు జీవిత ఖైదుతో పాటు నగదు దోపిడీకి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. శ్రీసిటీలోని ఒక పరిశ్రమంలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు ప్రేమించుకుంటున్నారు. 2019, ఫిబ్రవరి 3న రాత్రి 10:30 గంటల సమయంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ చివర్లో కూర్చొని పెళ్లి విషయమై మాట్లాడుకొంటున్నారు. అదే సమయంలో నలుగురు యువకులు అతడిపై దాడిచేసి నగదు లాక్కున్నారు. ఆ యువతిని కాస్త దూరం లాక్కెళ్లి గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. మళ్లీ ఆమెను తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసి పరారయ్యారు. అప్పట్లో ఈ గ్యాంగ్‌రేప్ సూళ్లూరుపేటలో సంచలనం రేపింది. అప్పటి సీఐ కిషోర్ బాబు, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ మురళీకృష్ణ, కోర్ట్ లైజన్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కే.ఖాజాహుస్సేన్ సాక్ష్యాలను సరైన సమయంలో సమర్పించి నేరం రుజువ్వడానికి కృషి చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫీ మాలిక్ వాదనలు వినిపించారు.

మానసిక దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్ పక్కనే ఉన్న మానసిక దివ్యాంగుల కేంద్రంలో శుక్ర వారం నెల్లూరు రూరల్ మండలం పొట్టే పాళెం గ్రామానికి చెందిన ఎస్ సుమంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అన్న దాన కార్యక్రమాన్ని చేపట్టారు. మానసిక చిన్నారుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. అలాగే నిత్యావసర సరుకులను అం దజేశారు. కార్యక్రమంలో సిస్టర్ నిత్య, టీడీపీ యువనేత వల్లూరు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11616
వెండి కిలో ధర	రూ. 169000
వెండి ఒక గ్రాము	రూ. 173.00

చిన్నపాటి చినుకులకే జలమయం

● అధ్వానంగా పెంచలకోన రోడ్డు
● నీటిలోనే మృతదేహన్ని దించాలి

రాపూరు, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో వేసిన రోడ్డు స్థానికంగా ఉన్న ప్రజలకు శాపంగా మారింది. పట్టణంలోని సిద్దలయ్య దేవాలయం నుండి పెంచలకోనకు వెళ్లే దారిలో చిన్నపాటి వర్షానికే నీళ్లు మోకాలి లోతులో నిలబడిపోతున్నాయి. ఈ రోడ్డు వెంబడి సైడు కాలువలు లేకపోవడం, ఆ ప్రదేశం ఇరు వైపులా ఎత్తులో రోడ్డు ఉండడం వల్ల నీరు నిల్వ ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే కాకుండా దింపుడు కల్లాం ప్రదేశం కావడంతో మృతదేహన్ని ఆ మురుకి నీరులోనే దించే పరిస్థితి నెలకొంది. అందులోనూ దోమలు వ్యాప్తి చెంది, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. రోడ్డు ఎత్తు పెంచి, డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపై మడుగును తలపిస్తున్న వర్షపు నీరు.

రాజ్యాంగ దినోత్సవం

పొదలకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగమే బలమని రిటైర్డ్ ఉపఖజానాధికారి ఖలీల్ సాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ (న్యూఢిల్లీ) సౌజన్యంతో అమ్మ మహిళా సేవా సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగార్జున స్కూల్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని పొదలకూరులో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్‌టీఓ ఖలీల్ సాహెబ్, నాగార్జున స్కూల్ చీఫ్ అడ్వైజర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గ, ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, ఆర్యవైశ్య నేతలు డాక్టర్ బ్రహ్మయ్య, పొట్టి సుధాకర్, గుర్రం మీరామదు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ మహిళా సేవా సమాజ్ ప్రెసిడెంట్ సుమతి, సెక్రటరీ అహ్మద్, పాఠశాల డైరెక్టర్ చంద్రశేఖర్, ఏఓ జీవీఆర్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి పల్లకీ సేవలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి పల్లకీ సేవలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి పురోహితులు నిర్వహించిన నిత్య కళ్యాణోత్సవం భక్తులను ఆకట్టుకుంది. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కోటి సంతకాల సేకరణ


తొలి సంతకం చేస్తున్న కాకాణి

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కాకాణి పూజితమ్మతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాకాణి తన తొలి సంతకంతో కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, ఈదగాలి ఎంపీటీసీ వేమారెడ్డి రాఘునందన్‌రెడ్డి, వైసీపీ నేతలు భాస్కర్ నాయుడు, మోహన్ నాయుడు, భాస్కర్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుపూరులో బాలికా దినోత్సవం

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కనుపూరు గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 'బాల్య వివాహాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతు లను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ వీ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు సీహెచ్ భాగ్యలక్ష్మి, జీ సీతాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, అంగన్ వాడీ కార్యకర్తలు భద్రమ్మ, వసంతకుమారి, పరమేశ్వరి పాల్గొన్నారు.
మనుబోలు: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్ర వారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఆదినారాయణ మ్మ వ్యాసరచన పోటీలు, ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణజ్యోతి, పీఈటీ ప్రతిమ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, విజయ, సుగుణ, మునెమ్మ, శ్రీలక్ష్మీ, సుజన పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి రూ.14.20 కోట్లతో ప్రతిపాదనలు

ఉదయగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో చెరువులను ఆర్‌ఆర్‌ఆర్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు రూ. 14.20 కోట్లతో ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపినట్లు జలవనరుల శాఖ డీఈ కె చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్లపడియ, జీ.అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి, తిరుమలాపురం, వెంకట్రావుపల్లి, సీతారామ పురం మండలంలో ఊరచెరువు, స్వామిచెరువు, మర్రివాట్ల రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి

● వీఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతూ సమాజంలో మంచి మార్పునకు దోహదపడాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శుక్రవారం జాతీయ విద్యా విధానంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వ హించారు. డిజిటల్ ఇండియా అంశంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ దేశం వేగంగా డిజిటల్ మార్గం వైపు పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో వర్సి టీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ మధుమతి, జీ విజయ లక్ష్మి, డాక్టర్ టీ విమల, డాక్టర్ జీ మేరీ సందీప్, డాక్టర్ వీబీ సుచరిత పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం కావాలి

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే యువతకు ప్రేరణగా నిలిచే వికసిత్ భారత్ - యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ కార్యక్రమం మై భారత్ పోర్టల్ ప్రారంభమైందని వీఎస్‌యూ వీసీ ఆచా ర్య అల్లం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. యువత తమ ఆలోచన శక్తి, దూరదృష్టి, నాయకత్వ ప్రతిభను ప్రదర్శించి వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఆసక్తిగల వారు మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని క్విజ్ ఆప్షన్ ద్వారా పాల్గొన్నాలన్నారు. విజేత లకు ప్రధానమంత్రి నరేంద్రమోడీని ప్రత్యక్షంగా కలిసే అవకాశం లభిస్తుందన్నారు.

అనాథలైన పిల్లలకు చేయూత

● ఎక్స్‌గ్రేషియా అందేలా కృషి ● రూ. 2 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్


చిన్నారులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి

ఇందుకూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి) : ఇందుకూరు పేట మండలం అరుంధతీ వాడకు చెందిన చలగల శ్రీనివాసులు కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అండగా నిలిచారు. గత నెలలో దుర్ఘటన జరిగిన వెంటనే విష యాన్ని ముఖ్యమంత్రి చంద్ర బాబు దృష్టికి తీసుకెళ్లి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రే షియా అందేలా చేయూత నందించారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రు లను కోల్పోయిన విశ్వంత్, సింధుప్రియల పేరిట రూ. 2 లక్షలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాన వత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, కోడూరు కమలాకర్ రెడ్డి, పి. చెంచుకిషోర్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, సూదలగుంట నాగార్జున నాయుడు, దాసరి విజయ్‌కుమార్, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇక బోధనేతర యాప్‌లు వాడలేం!

●ఉపాధ్యాయుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

మనుబోలు, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): ఇకనుంచి బోధనేతర యాప్‌లు వాడి, ప్రభుత్వానికి నివేదికలు పంపలేమంటూ ఉపాధ్యాయులు శుక్రవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ ఆందోళన చేస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నబోజన నిర్వహణ, మూల్యాంకనానికి సంబందించిన పనులు తప్ప, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్‌టి2.0లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు చేపట్టబోమన్నారు. ఎంఈవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌కు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, రవి, మనోజ్, అనీల్, వెంకటేశ్వర్లు, రామయ్య, సాదు హైజాక్, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జొన్నవాడ కామాక్షితాయి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలో శనివారం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులు తిరుమూరు అశోక్‌రెడ్డి, నక్కల శివకృష్ణ, తిరువాయిపాటి నందకుమార్, పెన్నతూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మి, పాలూరు చాముండేశ్వరి, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూష, ముంగర సుధాకర్, రామాయణం సుధారాణి, కొల్లపూడి శారద, ఎక్స్ అఫిషియో సభ్యుడు వారణాసి వెంకట శివగంగా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రామకృష్ణారెడ్డి

మనుబోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండా ప్రకారం పలుశాఖల అధికారులు వారి శాఖకు కేటాయించిన పథకాలు, ప్రగతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఉపాధ్యక్షురాలు చందన, ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, సొసైటీ ఛైర్‌పర్సన్ పొన్నూరు రామకృష్ణయ్య, ఎంపీడీవో జలజాక్షి, ఎంపీటీసీ సభ్యులు, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా యూరియా విక్రయిస్తే చర్యలు

భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ కన్నయ్య


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 8 ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికా రుల ఆదేశాలతో శుక్రవారం వ్యవసా యాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నెల్లూరు భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ కన్నయ్య, మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్యలు మనుబోలు, లక్ష్మీనరసింహపురం, కాగితాలపూరు, పిడూరుపాళెం గ్రామాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. ఈ తనిఖీలలో పిడూరుపాళెంలోని శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో సరైన పత్రాలు లేవని గుర్తించారు. దీంతో గోదాములో ఉన్న రూ. 75,400 విలువ గల యూరియాను విక్రయించరాదని దుకాణదారుడికి హెచ్చరించారు. ఒకవేళ పత్రాలు లేకుండా విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తాం


మొక్కలు నాటుతున్న ఆలయ కమిటీ చైర్మన్ సురేష్ కృష్ణ, టీడీపీ నాయకులు

విడవలూరు, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): రామతీర్థంలో వెలసిన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తామని, ఆలయ కమిటీ ఛైర్మన్ అత్తిరాల సురేష్ కృష్ణ తెలిపారు. శుక్రవారం సింగిరి కోటి సౌజన్యంతో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్ర శాంతి సహకారంతో భక్తులకు మరుగుదొ డ్లు, తాగునీటి వసతి కల్పిస్తామ న్నారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటర మణయ్య, మాజీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాడి చంద్రశేఖర్, నాయకులు తంబి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవినీతిని అంతం చేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అవినీతిని అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని గండి పాళెం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనే జరు షేక్ నజీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ లంచాలు ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరంగా భావించాలని సూచిం చారు. అలాగే అవినీతి రహిత దేశం కోసం నిర్వర్తించాల్సిన హక్కులు, బాధ్యతలపై అవ గాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ మనోజ్‌కుమార్

మనుబోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నెల్లూరు కాంపోజిట్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మానసిక రుగ్మతతో బాధపడుతున్న పిల్లలకు ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. అలాగే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు మానసిక ఆరోగ్యాన్ని ఎలా దక్కించుకోవాలో తెలియజేశారు. అనంతరం కొంతమంది మానసిక పిల్లలకు స్క్రీనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి. రాకేష్ డెవలప్‌మెంట్ థెరపిస్ట్, ఎం. మల్లిఖార్జుననాయక్, స్పెషల్ ఎడ్యుకేటర్, పాఠశాల హెచ్‌ఎం అమూల్యకుమారి, ఐఈడిఎస్‌ఎస్ ఉపాధ్యాయుడు మాల్యాద్రి, ఐఈఆర్‌పి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది, ఆశా వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఒత్తిడి ఆందోళన, డిప్రెషన్‌లాంటి సమస్యలతో బాధపడే వారిని మానసిక సమస్యలతో ఆత్మహత్యా ప్రయత్నం చేసిన వారితో సన్నిహితంగా ఉంటూ కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా మెంటల్ హెల్త్ టీం డాక్టర్ క్రిస్టినా మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంలేనిదే సంపూర్ణ ఆరోగ్యం లేదని, మానసిక ఆరోగ్యం ఉండాలంటే మంచి ఆహారం సంపూర్ణ నిద్ర, పాజిటివ్ థింకింగ్ నమ్మకమైన వ్యక్తులతో సమస్యలను పంచుకోవడం, వ్యాయామం, మెడిటేషన్ లాంటివి అలవర్చుకోవడం ద్వారా మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్.సుధాకర్‌రావు, క్లినికల్ సైకాలజిస్టు కె.రేవతి, హెచ్‌ఈవోఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశా వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్‌లో ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా వల్లూరుకు చెందిన బొమ్ము నరేష్‌కుమార్ (41) సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అయితే తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతానంటూ భార్యకు తరచూ చెప్పేవాడని, ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె గమనించి తల్లికి సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోగోలులో దొంగల హల్‌చల్

బిట్రగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని బృందావనం, కుమ్మరవీధుల్లో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గత ఏడాది బృందావనంలో ఏకంగా ఐదు ఇళ్ళలో దొంగలు జొరబడి రెండు ఇళ్లలో చోరీలు చేసిన సంఘటన తెలిసిందే. దీంతో అప్రమత్తంగా ఉన్నామని స్థానికులు తెలిపారు. అయితే కుమ్మరవీధి చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో బైక్ చోరీకి గురైందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితుడు గుర్రంకొండ వంశీ తెలిపారు.

ఘాట్ రోడ్డుపై భారీ వాహనం బోల్తా

● స్తంభించిన ట్రాఫిక్


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన ఐరన్ లోడ్

సీతారామపురం, అక్టోబర్ 10 (ఆంధ్ర జ్యోతి): సీతారామపురం - పోరుమామిళ్ళ ఘాట్ రోడ్డులో ఐరన్ లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనం శుక్రవారం బోల్తా పడింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్ళ నుంచి ఐరన్ లోడ్‌తో కనిగిరికి వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడు ఇచ్చేందుకు మలుపు తిప్పే క్రమంలో బోల్తాపడింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జేసిబి, క్రేన్ల సహాయంతో లారీని పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

దుత్తలూరు (ఉదయగిరి), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ చింతలగుంట గ్రామ సమీపాన 565 జాతీయ రహదారిపై కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దుగ్గినబోయిన పెదబాలనరసింహులు (70) రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో వైఎస్‌ఆర్ కడప జిల్లా బద్వేల్ నుంచి పామూరు వైపు వెళుతున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో అతన్ని ఢీకొట్టడంతో కారు బోల్తాపడింది. అనంతరం స్థానికులు అక్కడికి చేరుకుని కారును ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు. అయితే పెదబాలనరసింహులను కారు ఢీకొన్న విషయం ఎవరూ గమనించలేదు. సాయంత్రమైనా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానం వచ్చి కారు ప్రమాదం జరిగిన ప్రదేశంలో చూడగా అతని పాదరక్షలు కనిపించాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టగా చెట్లపొదల్లో అతను విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్థులు బయటకు తీసి గమనించగా మృతిచెంది ఉన్నాడు. గ్రామస్థులు సమాచారాన్ని పోలీసులకు అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు



సీతారామపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సుబ్బయ్య అనే వ్యక్తి శుక్రవారం మద్యం మత్తులో ఉదయగిరి నుంచి మోటార్‌సైకిల్‌పై వస్తూ ఎస్‌ఆర్ నగర్ వద్ద రోడ్డు దాటుతున్న మౌలాలి అనే వ్యక్తిని ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచా రంతో 108 సిబ్బంది వారిని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వారంపాటు 32 రైళ్లు రద్దు

● వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్
● గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..
● డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతు పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు ఈ నెల 11 నుంచి 18 వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ -డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ, విశాఖపట్నం-న్యూఢిల్లీ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం -సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయ ల్దేరుతుంది.

● శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేంద్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జతచేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్‌మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 540

భక్తిశ్రద్ధలతో రాహుకాల ఉద్వాపన పూజ

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్వాపన పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాహుకాల పూజలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం బయోమెట్రిక్ పద్ధతి ద్వారా 2 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదానం జరుగుతుందని, భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆలయ సహాయ కమిషనర్ కే.జనార్దన్‌రెడ్డి కోరారు. సాయంత్రం సంధ్యామేళం, వేద పారాయణం, కుంభహారతులు, పల్లకీసేవ జరిగాయి.



నేరాలకు కేరాఫ్ నెల్లూరు!

- బీహార్‌ను తలపించేలా ఘటనలు
- నగదు కోసం కిరాతకంగా హత్యలు
- రాత్రి ఏడు దాటితే రోడ్లపై తిరగాలంటే భయం
- పోలీసులకు సవాళ్లు విసురుతున్న పాత నేరస్థులు
- నిద్రపోతున్న నిఘా నేత్రాలు
- పాత నేరస్థులపై దృష్టి సారించే వారేరీ?
- వెలుగులోకి వస్తున్నవి కొన్నే.. చీకట్లో మరెన్నో..
- నెల రోజుల్లోనే మళ్లీ జంట హత్యలు



ఈ నెల 7వ తేదీన హత్యకు గురైన వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు కొన్నేళ్లుగా నేరాలకు అడ్డాగా మారింది. బీహార్ వంటి రాష్ట్రాలకు పరిమితమైన కత్తులతో బెదిరించి దోపిడీలు చేసే కల్చర్ నెల్లూరులో ప్రారంభమైంది. ఒంటరిగా వెళ్లే ప్రజలను లక్ష్యంగా చేసుకొని మార్గమధ్యలో అడ్డగించి దోపిడీలకు పాల్పడుతున్నారు. వారు నగదు ఇవ్వను అంటే విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేస్తున్నారు. నగరంలో వరుసగా జరుగుతున్న ఇలాంటి సంఘటనలు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఈనెల 6వ తేదీ రాత్రి పెన్నా బేరేజ్ సమీపంలో జరిగిన జంట హత్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పలువురు యువకులు మత్తులో కత్తులను బైక్‌లలో, ఫ్యాంట్ జేబుల్లో, బొడ్డులో, వీపు వెనుక ఫ్యాంట్‌లో, దాచుకొని తిరుగుతూ ప్రజలకు వాటిని చూపి నగదు ఇవ్వాలంటూ బెదిరిస్తూ దోచుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో లేడీ డాన్ అరుణ, రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించిన తర్వాత పోలీసులు రౌడీ మూకలపై లాఠీ ఝులిపించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో రౌడీ షీటర్లు పలు కేసుల్లో జైలుకు పోవడం, నిరంతర తనిఖీలు చేయడంతో కొంత కాలం నేరాలు కట్టడిలోకి వచ్చాయి. అయితే నగరంలో నగదు కోసం జరిగిన జంట హత్యలు సంచలనంగా మారడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. మనం నెల్లూరులో ఉన్నామా... బీహార్ వంటి ప్రాంతాల్లో ఉన్నామా అని చర్చించుకుంటున్నారు. ఏడాది కాలంలో పలు కారణాల వల్ల పదుల సంఖ్యలో హత్యలు జరిగాయి. ప్రధానంగా నగరంలో గడిచిన ఏడు నెలల కాలవ్యవధిలో 20కి పైగా హత్యలు జరిగాయి. కత్తులను చూపించి బెదిరించడం ఫ్యాషన్‌గా మారిపోయింది. ప్రేమికులు, ఫూటుగా మద్యం సేవించిన వారు, ఎస్-2 రోడ్డులో హిజ్రాల వద్దకు వెళ్లేవారు, లాడ్జీల నుంచి బయటకు వచ్చే వారు, అర్ధరాత్రి మద్యం సేవించి వెళ్లే మందుబాబులను మాత్రమే టార్గెట్ చేస్తూ కత్తులను చూపించి కొందరు దొరికిన వరకు దోచేస్తున్నారు. ఈ విషయాలను బాధితులు బయటకు చెప్పుకునేందుకు, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేస్తే పరువు పోతుందన్న భావనతో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో అనేక సంఘటనలు చీకటిలోనే ఉండిపోతున్నాయి.

● కత్తులతో తిరగడం నగరంలో స్టైల్

ప్రస్తుతం నగరం నేరాలకు అడ్డాగా మారింది. ఈ క్రమంలోనే యువత, నేర చరిత్ర కలిగిన వారు ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో తల్లిదండ్రులకు వెళ్లి వస్తామని చెప్తారో లేదో తెలియదు కాని తాము ఇష్టంగా కొనుగోలు చేసిన కత్తులను మాత్రం తమ వెంట తీసుకురావడం మరవడం లేదు. చిన్నచిన్న గొడవలకు కత్తులను బయటకు తీసి వేసేస్తా అంటూ బూతులు తిడుతూ తగ్గేదేలా అంటూ సినిమా డైలాగ్‌లు కొడుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో వరుసగా జరుగుతున్న సంఘటనలతో ప్రజలు ఒంటరిగా వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు.

● నిఘా నిద్రపోతుండటంతో..

పోలీసు నిఘా నిద్ర పోతుండటంతో వరుస నేరాలను జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు స్టేషన్‌లలో ఉన్న క్రైమ్ పార్టీలు ఆయా స్టేషన్‌లలో ఏళ్ల తరబడి పాతుకు పోవడంతో నేరస్థులకు అండగా ఉండటంతో పలుమార్లు నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్థులపై నిఘా ఉంచడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక రాత్రి పూట బీట్ సైరన్‌లకే పరిమితం అవుతోందని, నాయకుల సిఫార్సులతో నేరాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో హత్యలతో పాటు మోసాలు, స్కామ్‌లు, ఇలా చెప్పుకుంటూ పోతే నేరాలకు అడ్డా అన్న పేరు వచ్చేసింది. ఈ క్రమంలో నేరాల కట్టడికి కొత్తగా వచ్చిన ఎస్పీ ఇప్పటి వరకు ప్రత్యేక కార్యాచరణ చూపకపోవడం ప్రజలను భయాందోళలకు గురిచేస్తోంది.

జీవన ఎరువులతో భూసారం పెంపు

● నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి ● కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న కేవీకే కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరు వులతోపాటు వర్మికంపోస్టు, పశువుల ఎరువు, జీవన ఎరువుల ద్వారా భూసారం పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయ కర్త డాక్టర్ జీ.లలితాశివజ్యోతి రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే గ్రామ దత్తత కార్యక్రమం లో భాగంగా ఎస్సీ ఉప ప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) పరిధిలోని తిక్కవర ప్పాడు గ్రామ రైతులకు వరి పంట సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం నెల్లూరు కేవీకేలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల ఆరోగ్యంగా ఉంటే పంటలకు అవసరమైన పోషకాలు సమతుల్యంగా అందుతాయని చెప్పారు. జీవన ఎరువుల వినియోగం ద్వారా 25శాతం వరకు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించాలన్నారు. వీటి ఫలితంగానే ఎరువుల వినియోగం చేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తోందని రైతులు నాణ్యమైనవని ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు. విత్తనాన్ని నాటే ముందు విత్తనశుద్ధి చేయడం ద్వారా మట్టిలో వ్యాపించే శిలీంధ్రాల నుంచి పంటను కాపాడుకోవచ్చని వివరించారు. చౌడు సమస్య ఉన్న నేలల్లో ఎంసీఎం-103 రకాన్ని సాగు చేయడం అనుకూ లమని సూచించారు. అనంతరం రైతులకు బీపీటీ-5404, ఎంసీఎం-103 రకం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన



సీఎం చంద్రబాబును కలిసిన ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పటిష్ట బందోబస్తు నడుమ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ క్రమంలో ఎస్పీ అజిత వేజెండ్ల ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

● జనసేన నేతల ఘన స్వాగతం

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జనసేన పార్టీ జిల్లా నేత నూనె మల్లికార్జున యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శరత్ పాల్గొన్నారు.



సీఎంకు కత్తిని బహూకరిస్తున్న జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్

డీఎస్‌డీవోగా పాండురంగారావు

● ఖోఖో కోచ్‌గా ఆర్‌కే యతిరాజ్



పాండురంగారావు

నెల్లూరు(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా ఫుట్‌బాల్ కోచ్ ఎం.పాండురంగారావును నియమిస్తూ శాప్ ఎండీ ఎస్.భరణి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాల డీఎస్‌డీవోల బదిలీల్లో భాగంగా నెల్లూరు డీఎస్‌వోలో సీనియర్ ఫుట్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న పాండురంగారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఎస్‌డీవోగా నియమించారు. ప్రస్తుతం డీఎస్‌డీవోగా పని చేస్తున్న ఆర్‌కే.యతిరాజ్ త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయనను నెల్లూరు డీఎస్‌వోలోనే ఖోఖో కోచ్‌గా నియమించారు. గతంలో కొంతకాలం డీఎస్‌డీవోగా పనిచేసిన అనుభవంతో పాటు సుదీర్ఘకాలంగా జిల్లాలో ఫుట్‌బాల్ కోచ్‌గా సేవలందించిన పాండురంగారావు ప్రస్తుతం సీనియర్‌గా ఉండడంతో ఆయనను జిల్లా అధికారిగా నియమించారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ

కావలి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కావలి పట్టణంలోని విత్తన తయారీ, ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మండల వ్యవసాయశాఖాధికారిణి లలిత మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభం అవుతున్నందున నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుదాణదారులను హెచ్చరించారు. 53 వరి విత్తన నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాల పరీక్షకు పంపించారు. సిరి సీడ్స్, నాగార్జున సీడ్స్ విత్తన తయారీ కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో సీఐ ఎస్‌కే సుబానీ, విజిలెన్స్ ఏవో వేణుగోపాల్, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగర చరిత్రలో తొలిసారిగా పినాకినీ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ సమీపంలోని ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన నయాగరా జలపాతం.. సాగర జలకన్యల విన్యాసాల ఎగ్జిబిషన్‌ను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎం.రాజారెడ్డి, ఎస్‌కె.బాబు, గడ్డం అచ్చయ్య నాయుడు, కరిముల్లాలు విలేకరులకు ఎగ్జిబిషన్ హైలెట్స్ వివరించారు. విదేశాలకే పరిమితమైన సాగర జలకన్య, జలకన్యూడుల మెర్మడ్ షోను ప్రదర్శన అత్యంత వ్యయప్రయాసలతో జిల్లా వాసులకు అందిస్తున్నామన్నారు. వాటర్ టన్నెల్‌లో సాగర జలకన్య వేషధారణలతో విదేశీ మహిళా కళాకారిణి ప్రదర్శింస్తారన్నారు. జలకన్యలు అభూత కల్పనలని నేటి తరానికి తెలియజేయడం ఈ ప్రదర్శన ఉద్దేశమన్నారు. విదేశాల్లోని నయాగరా జలపాతాన్ని 100 అడుగుల పొడవు, 25 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశామన్నారు. దేశం నలుమూలల నుంచి ఉత్పత్తిదారులతో వస్త్రాలు, బ్యాంగిల్స్, గృహోపకరణాల తదితర స్టాల్స్ ఉన్నాయన్నారు. 20 జయింట్‌వీల్స్, కొలంబస్ వంటి అనేక రకాల అమ్యూజ్‌మెంట్ రైడర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతీరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10గంటల వరకు శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిలాలోని పలు పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బీవీ.రమణయ్య, ఎం.దేవికలు తెలిపారు. ఎంపిక కమిటీ సభ్యులుగా విజయ్ విశ్వేశ్వరన్, జీడీ.సురేష్, బాబూరావు, విజయ్‌కుమార్, సుబ్బారావు, నాగరాజు, మునికుమార్‌లు వ్యవహరించారు.

శిశువుల్లో వినికిడి లోపాన్ని గుర్తించండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప

నెల్లూరురూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులను తరచూ పలకరిస్తూ ఉండటం వల్ల వినికిడి లోపాన్ని గుర్తించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప తెలిపారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను నెల్లూరు రూరల్ పరిధిలోని డ్రైవర్స్‌కాలనీ ఆనంద్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0-6 నెలల నవజాత శిశువులను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. విధిగా తల్లిపాలు పట్టించాలని స్పష్టం చేశారు. ఈ సమయంలో తరుచూ పలకరిస్తుండడం వల్ల శిశువుల్లోని లోపాలు గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు తల్లిపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు కోడిగుడ్ల పంపిణీ



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ సంఘం నేతలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం వాకర్స్‌కు కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెక్ మాజీ జోనల్ చైర్మన్ నలుబోలు బలరామయ్యానాయుడు మాట్లాడుతూ కోడిగుడ్డు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. గుడ్డులోని పోషక విలువలు అందరికీ అందాలన్న ఉద్దేశంలో వాకర్స్ 500 మందికి గుడ్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్ల దాత బెజవాడ సునీల్‌రెడ్డి, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి మాగంటి ప్రసాద్, నేతలు ఏకొల్లు రాఘవరెడ్డి, నసీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్‌పై కరస్పాండెంట్లకు అవగాహన

నెల్లూరు(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అపస్మా ఆధ్వర్యంలో కార్మికశాఖ సహకారంతో నగరంలోని నేతాజీ పైలట్ స్కూల్‌లో ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్)పై కరస్పాండెంట్‌లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భవిష్యనిధి స్కీమ్‌లో చేరాలని, దీనివలన వయసు పెరిగిన తరువాత ఈ నిధి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కరస్పాండెంట్లందరూ పీఎం వికసిత భారత్ రోజ్‌గార్ యోజనపై అవగాహన పెంచుకుని స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కార్మికశాఖ ఏసీ నజీర్, కావలి లేబర్ ఆఫీసర్ హరిబాబులు పీఎఫ్ గురించి, స్కీమ్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి కృష్ణారావు, రాష్ట్ర సలహాదారు వెంకటరామయ్య, నేతలు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మరిన్ని..

(5వ పేజీ తరువాయి)

సందర్శించారు. తొలుత సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థుల ప్రార్థనల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల కంప్యూటర్ నైపుణ్యాన్ని, విద్యార్థుల మ్యాథ్స్, సైన్స్ ప్రదర్శనలను స్వయంగా పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా వారు సమాధానం చెప్పడంతో ఎక్సలెంట్ అంటూ పొగిడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని నడుచుకోవాలని సూచించారు. పిల్లల్లో మంచి ఆత్మవిశ్వాసాన్ని, ఒక నమ్మకాన్ని కల్పిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థులందరికీ 'ఆల్ ద బెస్ట్' అని చెప్పి అక్కడ నుంచి బయలుదేరి పక్కనే ఉన్న నంది పవర్ త్రెడ్ మిల్ మిషనరీని, గోశాలను ప్రారంభించారు.. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎడ్ల సంతతి, వాటి జాతుల గురించి నిర్వాహకులు సీఎంకు వివరించారు. ఎడ్ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్ (నంది పవర్ బుల్ ప్రాజెక్టు)ను ఆసక్తిగా సీఎం తిలకించారు. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించి సందర్శించారు. అక్కడి నుంచి సభ ప్రాంగణానికి చేరుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు చింతా శశిధర్ ఫౌండేషన్ చైర్మన్ చింతా శశిధర్ స్వయంగా జ్ఞాపికను అందజేశారు.



నందగోకులం లైఫ్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం, డీఎస్ఆర్, కోటమిట్ట, రాజేంద్రనగర్, ఏకేనగర్, పడారుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్లు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాజీవ్ గృహకల్ప, గాంధీ గిరిజనకాలనీ, జనార్దన్‌రెడ్డి కాలనీ, జడ్పీ కాలనీ, పోస్టల్ కాలనీ, పద్మావతి సెంటర్, వాకర్స్ రోడ్డు, కుద్దూష్‌నగర్, రంగనాయకులపేట, ఇసుకడొంక, సంతపేట, మనుమసిద్ధినగర్, పరమేశ్వరి నగర్, సావిత్రినగర్, గాయత్రినగర్, రిత్విక్ ఎన్‌క్లేవ్, బీవీ నగర్, ఆర్‌డీవో ఆఫీసు రోడ్డు, పడారుపల్లి, సుందరయ్య కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, దీనిని వినియోగదారులు గుర్తించుకోవాలని ఆయన తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు చేయూత



షైనింగ్ అవార్డులు సాధించిన విద్యార్థినులతో వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రతిభ చూపి మంచి ఫలితాలు సాధించిన దివ్యాంగ విద్యార్థుల ఉన్నత చదువులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఈ ఏడాది జూన్ 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమంలో నెల్లూరు, పొదలకూరు భవిత కేంద్రాల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యాస్వరూపిణి, భవాని పూజిత, పిరివల్లి అనే దివ్యాంగ విద్యార్థులు షైనింగ్ అవార్డులు సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థినుల ప్రతిభను గుర్తించిన వేమిరెడ్డి దంపతులు వారి ఉన్నత చదువులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం వారికి శుక్రవారం వీపీఆర్ నివాసంలో వారికి ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేట్ ప్రసాద్‌రావు, ఎంఈవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



అగ్నిప్రమాద బాధితులకు నగదు అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సంతపేట మార్కెట్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దుకాణాలు కోల్పోయి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆర్థిక సహాయం అందచేశారు. ప్రమాద సమయంలో ఆయన ప్రకటించిన మేరకు శుక్రవారం టీడీపీ నాయకులు మార్కెట్ వద్దకెళ్లి బాధితులకు నగదు అందచేశారు. పూర్తిగా దగ్ధమైన 8 దుకాణాలకు రూ.50 వేలు చొప్పున రూ.4 లక్షల, పాక్షికంగా దెబ్బతిన్న 12 దుకాణాలకు రూ.25 వేలు చొప్పున రూ.3 లక్షల, అత్యంత స్వల్పంగా దెబ్బతిన్న 30 దుకాణాలకు రూ.10 వేలు చొప్పున రూ.3 లక్షల పరిహారాన్ని బాధితులకు అందజేశారు. దెబ్బతిన్న దుకాణాలన్నింటిని మరమ్మతులు చేయించి అతి త్వరలో బాధితులకు అందజేస్తామని డీసీ చెన్నుడు, టీడీపీ మహిళ నేత విజేతరెడ్డి తెలిపారు. మార్కెట్లో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే వారిని మంత్రి అన్నివిధాల ఆదుకుంటారని వెల్లడించారు. ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, రేవతి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నమ్మండి... ఇవి సిమెంట్ రోడ్లేనండి!



నాగుల బావివీధిలో కంకర తేలిన సిమెంట్ రోడ్డు

ఉదయగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్నవి సిమెంట్ రోడ్లే !. ఉదయగిరి పట్టణంలో ఏ వీధి చూసినా ఇలా గుంతలుపడ్డ, కంకర తేలిన, కుంగిన, మట్టిలో కలిసిన సిమెంటు రోడ్లే దర్శనమిస్తున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ రహదారులపై రాకపోకలు సాగించేందుకు పాదాచారులే కాదు.. వాహనదారులూ ఇబ్బందిపడుతున్నారు. దీనికితోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ రహదారులు మరింత ఛిద్రమై, వాటిపై రాకపోకలు సాగించలేక పట్టణ వాసులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. రోడ్ల దుస్థితి, ప్రజల బాధలను గమనించిన పాలకులు, అధికారులు పల్లెపండుగ-2 కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరు చేశారు. అయితే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పల్లెపండుగ-1 కార్యక్రమానికి సంబంధించి 40 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉండడం, మరలా రెండో విడత సిమెంట్ రోడ్లు మంజూరు కావడంతో పనులు చేస్తే బిల్లులు ఎప్పుడు వస్తాయోనన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం.




సినిమా హాలు వీధిలోని ఈ రహదారిపై నడక నరకమే!

ఊరిపోవద్దు!

- ప్రమాదకరంగా మారుతున్న ఊబకాయం
- అనేక వ్యాధులకు ఇది మరో కారణం
- జిల్లా జనాభాలో 30 శాతం భారీ కాయులే!
- చిన్నారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్న వైనం
- ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌ను దూరం పెట్టాలి

● నేడు ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినం



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితిలో ఊబకాయం ప్రమాదకరంగా మారుతోంది. ప్రాణాంతకమైన గుండె వ్యాధులకు సైతం ఇది కూడా కారణమవుతోంది. అధిక పొట్ట - రోగాల పుట్ట అన్న వైద్యుల మాట అక్షర సత్యాలవుతున్నాయి. ఆధునిక జీవన విధానంలో ఆహార అలవాట్లు మారుతుండటంతో ఊబకాయం (ఒబేసిటీ) సమస్య ఎంతో మందిని వేధిస్తోంది. శారీరక వ్యాయామం లేకపోవడం దీనికి మరో కారణం. పెద్దలతోపాటు చిన్నారులు కూడా ఊబకాయం బారి నపడుతుండటం ఆందోళన కలిగించే అంశం. దీనిని నిర్లక్ష్యం చేస్తే ఎన్నో వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా అక్టోబరు 11వ తేదీని ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినం జరుపుకోవాలని తీర్మానించింది. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చింది.

● జిల్లాలో 30 శాతం

జిల్లా జనాభా సుమారు 27 లక్షలుకాగా అందులో 30 శాతం ఊబకాయులు ఉన్నట్లు అంచనా. వీరిలోనూ 50 శాతం మంది ఉన్నత వర్గాలకు చెందిన మహిళలేనని అధ్యయనం చెబుతోంది. అలాగే, అన్ని వర్గాల పురుషులలో 30 శాతం, చిన్న పిల్లల్లోనూ 20 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. నెయ్యి, డాల్డా, నూనె కలిసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినటంతో రక్తంలో కొవ్వు శాతం పెరిగి ఊబకాయానికి దారితీస్తోంది. బాధితుల్లో 40 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి. తక్షణం మేల్కొని జీవనశైలిని మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

● చిన్నారుల్లో సైతం...

గతంలో నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం, వైద్య కళాశాల విద్యార్థులు నెల్లూరు నగరంలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో 8 నుంచి 16 ఏళ్ల వయసున్న విద్యార్థులపై సర్వే చేశారు. ఈ సర్వేలో 850 మందిని పరిశీలించగా వారిలో 220 మంది అంటే 25 శాతం పిల్లలు ఊబకాయ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. జన్యుపరమైన సమస్యలు, థైరాయిడ్ సమస్యతో కొందరు ఊబకాయులుగా మారుతున్నప్పటికీ గత పదేళ్లలో మారుతున్న ఆహార అలవాట్లు, ఇతరత్రా కారణాల వల్ల ఎక్కువ మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. చదువులో పోటీతత్వం పెరగటం, వ్యాయామంపై శ్రద్ధ పెట్టకపోవడంతో బడి ఈడు పిల్లలు ఈ వ్యాధికి గురవుతున్నారు. జంక్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ ఫుడ్, హోటళ్లలో, రోడ్డు పక్కన లభించే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్య ఎదురవుతోందని వైద్యులు చెబుతున్నారు. ఆహార నియంత్రణ, నిత్యం వ్యాయామంతో దీనిని అదుపు చేయవచ్చని సూచిస్తున్నారు. అలాగే, ఒబేసిటీ సమస్య పరిష్కారానికి బేరియాట్రిక్ శస్త్ర చికిత్స, ఖరీదైన లైపోసెక్షన్ చికిత్స అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఆధునిక బేరియాట్రిక్ శస్త్రచికిత్స



ఆధునిక బేరియాట్రిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉంది. ఇది చేయించుకుంటే భవిష్యత్తులో ఊబకాయం సమస్య ఉండదు. పైగా గుండె జబ్బులు, మధుమేహం, పక్షవాతం వంటి వ్యాధుల నుంచి ఉపశమనం పొందే వీలుంటుంది. ఇప్పటికే అనేక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించాం. ప్రస్తుతం ఊబకాయం సమస్య తీవ్రంగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు వ్యాయామం చేయాలి.

\- డాక్టర్ శ్రీరామ్‌సతీష్, బేరియాట్రిక్ సర్జన్, అపోలో ఆసుపత్రి

ప్రతి ఒక్కరు అప్రమత్తతగా ఉండాలి



ఊబకాయం విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి. చిన్ననాటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. అశ్రద్ధ చేస్తే తీవ్ర అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చిన్నారుల్లో 25 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. వయసు పెరిగే కొద్దీ తృణధాన్యాలతోపాటు వరి అన్నం ఎంతో మంచిది. అలాగే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఇంట్లో అమ్మ చేసే చిరుతిండ్లు మంచివి, బయట దొరికే ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ జోలికి పోవద్దు.

\- డాక్టర్ గంగాధర్, ఫిజీషియన్, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



ముఖ్యమంత్రితో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి దంపతులు

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం ఈదగాలి హెలీప్యాడ్ వద్ద సీఎం నారా చంద్రబాబు నాయుడికి శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నందగోకులం లైఫ్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 3.14 గంటలకు సీఎం చేరుకున్నారు. ముఖ్యమంత్రికి చింతా శశిధర్ ఫౌండేషన్ ఛైర్మన్ చింతా శశిధర్, అనిల్ యం డ్లూరి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, కందుకూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, దగుమాటి కృష్ణారెడ్డి, పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజండ్ల, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు ఘనస్వాగతం పలికారు. వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల అనంతరం చంద్రబాబు సాయంత్రం 4.53 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి తిరుగు పయనమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎంకు ఘనంగా వీడ్కోలు పలికారు.







సీఎంతో ఎమ్మెల్యేలు ఇంటూరి, కావ్య కృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, జెడ్ శివప్రసాద్ తదితరులు

ఉదయగిరి కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించండి


● కలెక్టర్‌కు సీఎం సూచన



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయంగా పేరుగాంచిన ఉదయగిరి వుడ్ కట్లరీ కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి శుక్రవారం జిల్లాకు విచ్చేసిన సీఎంకు కలెక్టర్ హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉదయగిరి వుడ్ కట్లరీ సెట్‌ను ముఖ్యమంత్రికి బహూకరించారు. దానిని ఆసక్తిగా చూసిన సీఎం.. చాలా బాగుందంటూ కితాబిచ్చారు. జిల్లాలో హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కలెక్టర్‌కు సూచించారు. ఉదయగిరి కళా నైపుణ్యా న్ని అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలన్నింటినీ ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

ఆర్‌వోబీని మంజూరు చేయండి


● నుడా ఛైర్మన్ కోటంరెడ్డి వినతి



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వినతిపత్రం అంద జేశారు. పది లక్షల జనాభా కలిగిన నగరంలో ప్రస్తుతం అయ్యప్పగుడి, వెంకటేశ్వర పురం వద్ద మాత్రమే ఫ్లైఓవర్లు ఉన్నాయని గుర్తు చేశారు. వర్షం కురిస్తే అండర్ బ్రిడ్జిల వద్ద రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నూతన ఆర్‌వోబీని మంజూరు చేయాలని సీఎంను కోరారు.

సర్వేపల్లి ఆధునికీకరణకు అనుమతులివ్వండి

● ఎమ్మెల్యే సోమిరెడ్డి విజ్ఞాపన



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. సర్వేపల్లి రిజర్వాయర్ ప్రమాదంలో ఉందని, దీని ఆధునికీకరణకు రూ.50.35 కోట్లు అవసరమని జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపిందని తెలియజేశారు. బండేపల్లి-డేగ పూడి కాలువ పనులు ప్రారంభానికి అవసరమైన రూ.43 కోట్ల నిధులను కూడా మంజూరు చేయాలని కోరారు. 4500 ఎకరాలకు సాగునీరు అందించేం దుకు అవసరమైన కండలేరు ఎడమ కాలువ(18ఆర్) పనులకు అనుమతులి వ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తిరుమల మ్మపాలెం వద్ద ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులివ్వాలని, ముత్తుకూరు పీహెచ్‌సీని 50 పడకల సీహెచ్‌సీగా స్థాయి పెంచాలని కోరారు.

రూరల్ అభివృద్ధి పుస్తకం అందజేత



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో ప్రత్యేకంగా తయారు చేయించిన బుక్ లెట్‌ను రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రికి అందజేశారు. నియోజకవర్గంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. త్రీఫేస్ విద్యుత్ లైన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఈ పనులకు చంద్రన్న విద్యుత్ వెలుగులు గా నామకరణం చేసినట్లు చెప్పారు. కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం కూడా జరుగుతోందని, వీటి ద్వారా 80 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని శ్రీధర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని సీఎం చంద్రబాబు అభినందించారు.

ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేని

పురుగు మందుల సీజ్

● విలువ రూ.12.4 లక్షలు



పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు పురుగు మందుల దుకాణాలలో వ్యవసాయాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరైన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేకుండా నిల్వ ఉంచిన రూ.12.4 లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాలతో ఉదయగిరి ఏడీఏ ముత్యాల శేషగిరిరావు నేతృత్వంలో వ్యవసాయాధికా రులు కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడులో ఈ దాడులు నిర్వహించారు. కందుకూరులోని మన గ్రోమోర్ సెంటర్‌లో రూ.3.7లక్షలు విలువైన పురుగు మందులను, ఉలవపాడు మన గ్రోమోర్ సెంటర్‌లో రూ.8.2 లక్షల విలువైన సరుకును, గుడ్లూరులోని ఓ ప్రైవేటు డీలరు వద్ద రూ.50వేల విలువైన మందులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కందుకూరు ఏవో అబ్దుల్ రహీం మాట్లాడుతూ సరైన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేకుండా విక్రయాలు సాగిస్తున్న పురుగు మందులలో నకిలీలు ఉండే అవకాశం ఉందని, అలాంటివి వినియోగిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు, ఉలవపాడు ఏవోలు బీ రవికుమార్, డీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా

డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ రామ్మోహన్



డాక్టర్ మస్తాన్ బాషా



డాక్టర్ రామ్మోహన్

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్ బాషా, కార్యదర్శిగా డాక్టర్ రామ్మోహన్, కోశాధికారిగా డాక్టర్ కేఆర్ హర్షవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే నెల్లూరు మెడికల్ సొసైటీ ఛైర్మన్‌గా డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ ప్రేమ్‌దీప్, కోశాధికారిగా డాక్టర్ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి కే.రాహుల్‌బాబు, అసోసియేషన్ సభ్యులు వీరిని ఎన్నుకున్నారు. వీరు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

ఇబ్బందిపెట్టే అధికారులను వదలం

● మాజీ మంత్రి కాకాణి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారికే పదవులు అప్పగించడం జరుగుతుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విరువూరులో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం చేపట్టడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన అధికారులను భవిష్యత్తులో విడిచి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తొలుత గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీ, నెల్లూరు పార్లమెంట్, నియోజకవర్గ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, కొడవలూరి ధనుంజయరెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మహిళల

అంతర్ కళాశాలల క్రీడలు ప్రారంభం

● కబడ్డీ విన్నర్స్ శ్రీసాయి, రన్నర్స్ జేబీ కళాశాల



కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న శ్రీసాయి, జేబీ కళాశాలల జట్లు

కావలి (టౌన్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం (వీఎస్‌యూ) మహిళల అంతర్ కళాశాలల క్రీడా పోటీలు శుక్రవారం కావలి పట్టణంలోని వర్సిటీ పీజీ కళాశాలలో జరిగాయి. వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయులు ఆధ్వర్యంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన పోటీలు ప్రారంభమయ్యాయి. వెంకట్రాయులు మాట్లాడుతూ విశ్వవిద్యాల యం విద్యతోపాటు క్రీడలకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. అనంతరం కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. 13 కళాశాలల నుంచి 220 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు.

విజేతలు...

కబడ్డీ ఫైనల్స్ పోటీలో కావలికి చెందిన శ్రీసాయి డిగ్రీ కళాశాల కావలికే చెందిన జేబీ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. శ్రీసాయి జట్టు విజయం సాధించింది. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో నెల్లూరు జెనెక్స్ కళాశాల క్రీడాకారిణి రాజేశ్వరి చాంపియన్‌గా, జేబీ కళాశాల విద్యార్థిని మేఘన రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో జెనెక్స్ కళాశాల నుంచి రాజేశ్వరి, ఓంకీర్తి విజయం సాధించగా, గూడూరు ఎస్ఆర్‌కే కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచింది. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీజీ కళాశాల పీడీ మణికంఠ, పరిశీలకురాలిగా డాక్టర్ విజయకళ వ్యవహరించారు. కార్యక్రమంలో పీడీలు నారాయణరాజు, రవీం ద్రబాబు, ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న వెంకట్రాయులు

వీధుల్లో చెత్త వేస్తే చర్యలు

కలువాయి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శైలజ హెచ్చరించారు. మేజర్ పంచాయతీ కలువాయిలో శుక్రవారం పారిశుధ్యాన్ని ఆమె పరిశీలించారు. ముఖ్యంగా బస్టాండు ప్రాంతంలో దుకాణదారులు తడి, పొడి చెత్తలను వేరుగా ఉంచుకుని పారిశుధ్య సిబ్బందికి అంద జేయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు ఉన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11616
వెండి కిలో ధర	రూ. 169000
వెండి ఒక గ్రాము	రూ. 173.00

చెరువు భూముల ఆక్రమణ

చేపల గుంతల ఏర్పాటు

చెరువు నుంచి నీటి చౌర్యం

కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం



గౌరవరం వద్ద అనధికారిక ఏర్పాటుచేసిన చేపల గుంతలు



అక్రమంగా నీరు తరలించే ఉపకాలువ



చేపల గుంతల్లో వేసిన కోళ్ల వ్యర్థాలు

అనంతసాగరం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాగరం చెరువు లోతట్టు భూములను యథేచ్ఛగా ఆక్రమించినా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గౌరవరం సమీపంలో చెరువు లోతట్టున.. జనసంచారం ఉండకపోవడంతో పట్టా భూములకు సమీపంలోని సాగరం చెరువు లోతట్టు భూములను కొందరు ఆక్రమించి వందల ఎకరాల్లో చేపల గుంతలు సాగుచేస్తున్నారు. చేపల గుంతలకు సమీపంలో ఉత్తర కాలువతో పాటు, చెరువునుంచి నీటిచౌర్యానికి పాల్పడుతున్నారు. రహస్యంగా ప్రత్యేక కాలువ తీసి నీరును గుంతలకు తరలిస్తున్నారు. వ్యర్థనీరు మరలా చెరువు వైపు వదులుతున్నారు. భూములు ఆక్రమించినా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలో చలనం లేదు. సామాన్య రైతులు విద్యుత్ కనెక్షన్లు పొందాలంటే డిస్కం అధికారుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరుచేసిన వైనం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇక బద్వేల్, అనంతసాగరం, సోమశిల, ఆత్మకూరు ప్రాంతాల నుంచి చనిపోయిన కోళ్లు, వాటి వ్యర్థాలను తెచ్చి గుంతల్లో వేస్తున్నారు. ఇక్కడ పెంచిన చేపలను సంగం, బుచ్చి, నెల్లూరు మార్కెట్లకు తరలిస్తున్నట్లు సమాచారం. కాగా, కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపలను తింటే ప్రాణాంతక క్యాన్సర్, లివర్, కిడ్నీ వ్యాధులు సోకే ప్రమాదం వుంది. కాగా, చెరువు లోతట్టు భూములను ఆక్రమించడం, అక్కడకు వెళ్లేందుకు కామిరెడ్డిపాడు సమీపంలో కొత్తగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో రాజమార్గం ఏర్పాటుచేసుకోవడం గమనార్హం. ఇంకా ఖాళీ జాగాల్లో కొత్త గుంతలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగరం చెరువు లోతట్టు భూముల ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

14న గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దమ్మానంద, ఏడీపీఎస్ నాయకులు

కలువాయి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం వెంబులూరు అంబేడ్కర్ నగర్‌లో ఈనెల 14వ తేదీన గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బంతేజి దమ్మానంద (ఇండోరా బుద్ధవిహార్ నాగపూర్) పిలుపునిచ్చారు. స్థానిక ఏడీపీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టేటి రమణయ్య, నిజమాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శాంతి వ్రత మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో మానసాదేవి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు రొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి ఆలయంలో శుక్రవారం కాల స్వరూప శౌరీ శాంతివ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి మంగళస్నానం, గోపూజ, గణపతి పూజ, పుణ్యహవచనం, పంచాంగ ఉపన్యాసం, అంకురారోపణ, మహా మండల షష్టి మహోత్సవ సమేత కాలస్వరూప శౌరీ ఆవాహనం, మహా మృత్యుంజయ, హోమాలు, మహా నివేదన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో లలితా రుద్ర మహాయజ్ఞం

సంగం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వర జ్ఞానపీఠంలో శుక్రవారం పీఠాధిపతి స్వామి రాజరాజేశ్వరానంద ఆధ్వర్యంలో వేదపండితులు లలితా రుద్ర మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లలితా రుద్ర మహాయజ్ఞం విశిష్టతను, ఆవశ్యకతను భక్తులకు వివరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఉభయకర్తలు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన

వింజమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న షాపుల యజమానులకు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామారావు, సర్పంచ్ నల్లగండ్ల సృజన, నూతన జీఎస్టీ విధానంపై అవగాహన కల్పించి అమలుపరచాలని కోరారు. స్థానిక బీసీ కాలనీలో టీడీపీ మండల అధ్యక్షుడు గూడా నరసారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులకు నూతన జీఎస్టీపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపాటి మాల్యాద్రి, భాష్యం ఎరుకల నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ

వైసీపీ సర్పంచ్, వార్డు సభ్యుల తీర్మానం

మర్రిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్ద గ్రామ పంచాయతీలను రెండు, మూడు పంచాయతీలుగా విభజన చేసి ప్రభుత్వం స్వపరిపాలన అందించాలనే ప్రతిపాదనలను చిన్నమాచునూరు పంచాయతీలో వార్డు మెంబర్లు, సర్పంచ్ వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. పంచాయతీ విభజన అంశంపై శుక్రవారం సచివాలయంలో వార్డు మెంబర్లతో పంచాయతీ కార్యదర్శి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మర్రిపాడు మండలంలో చిన్నమాచునూరు పంచాయతీ విభజనను వైసీపీకి చెందిన సర్పంచ్, వార్డు మెంబర్లు వ్యతిరేకిస్తూ తీర్మానం చేయగా అధికార పార్టీలో ఉన్న మరో వర్గం వారి అభిప్రాయానికి ఏకీభవించారు.

చెరువుల అభివృద్ధికి రూ.14.20 కోట్లతో ప్రతిపాదనలు

ఉదయగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో చెరువులను ఆర్ఆర్ఆర్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు రూ.14.20 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు జలవనరుల శాఖ డీఈ కె చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని ఉదయగిరి మండలంలో అర్లపడియ, జీ.అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి, తిరుమలాపురం, వెంకట్రావుపల్లి, సీతారామపురం మండలంలో ఊరచెరువు, స్వామిచెరువు, మర్రివూట్ల రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే చెరువుల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం నేరుగా పాఠశాలలకే చేర్చాలి

సంగం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల మధ్యాహ్న భోజన బియ్యం నేరుగా పాఠశాలలకే సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం ఎంఈవో -2 మల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన బియ్యం మండలంలోని సంగం, గాంధీజనసంఘం, దువ్వూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల స్టాక్‌పాయింట్‌ల నుంచి పాఠశాలలకు తీసుకువెళ్లమని చెప్పడంతో స్వంత ఖర్చులతో ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాల్సి వస్తోంది. నేరుగా పాఠశాలలకే సరఫరా చేయాలని గత నెలలో తహసీల్దారు సోమ్లానాయక్‌కు విన్నవించినా సరఫరా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అవినీతిని అంతం చేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అవినీతిని అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని గండిపాళెం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు షేక్ నజీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ లంచాలు ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరంగా భావించాలని సూచించారు. అలాగే అవినీతి రహిత దేశం కోసం నిర్వర్తించాల్సిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, క్లర్కులు అజయ్, రమేష్, మెసెంజరు చిన్నఖాశిం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏపీజీబీ సిబ్బంది

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కె హెప్సిబా అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబి కస్టమర్ సర్వీస్ అసోసియేట్ జి కిరణ్‌కుమార్, మున్సిపల్, మెప్మా, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఏఎస్ పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఆత్మకూరు ప్రాజెక్టు సిడిపిఓ పి సునీత తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి శ్రీదేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు.

ఎఫ్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

ఉదయగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఈనెల 13వ తేదీ నుంచి జరిగే ఎఫ్ఏ-2 పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఎంఈవోలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు సూచించారు. వారు శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లి హరిజనవాడ, సర్వరాబాదు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన

చేజర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో ఉన్న డా. బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై ప్రిన్సిపాల్ పద్మజ, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ మల్లికార్జున అవగాహన కల్పించారు.

విద్యార్థుల శ్రమదానం

ఉదయగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు శుక్రవారం పట్టణ వాసుల దాహార్తి తీర్చే కోన కాలువను శ్రమదానం నిర్వహించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు దుర్గం కొండపై గల తొట్టిలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు.

ప్రభుత్వానికి ఆటోవాలాలు అండగా నిలవాలి



చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, కాకర్ల సురేష్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆటోవాలాల భవిష్యత్తు దృష్ట్యా వాహనమిత్ర పథకం పేరుతో రూ. 15వేలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నాదెండ్ల రాజేంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి పెద్దిరెడ్డిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఆటోవాలాలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. అనంతరం చంద్రబాబుతో సహా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో దగ్గుబాటి రవి, ధనికుల నరసింహులు, దగ్గుబాటి మోహనరావు, అడుసుమల్లి రమేష్‌బాబు, పిచ్చయ్య, వెంకట నారాయణ, రత్తయ్య, రాజేంద్ర, వెంకట రామయ్య, అరవ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఉదయగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ ఎంవీ మురళిధరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రూ.3.50 కోట్ల నిధులతో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ఉషశ్రీ పథకంలో భాగంగా కళాశాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.3.50 కోట్లతో తరగతి గదులు, రూ.75 లక్షలతో గదుల మరమ్మతు పనులు, రూ.75 లక్షలతో కళాశాలకు ఫర్నీచర్, ల్యాబ్ సౌకర్యం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం భవనం కొలతలు సేకరించి గుత్తేదారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ఎన్ వెంకటేశ్వరరెడ్డి, శ్రావణకుమార్, సైట్ ఇంజనీర్ వెంకటప్రకాష్‌రెడ్డి, గుత్తేదారులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ పద్ధతులతో పంటల సాగు చేయాలి



రైతులకు యూరియా అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉదయగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాలపల్లి సహకార సంఘ సొసైటీ పరిధిలోని రైతులకు శుక్రవారం సొసైటీ చైర్మన్ గడ్డం వెంకట సామయ్య, ఏడీఏ పీ చెన్నారెడ్డిలు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీకి 13 టన్నుల యూరియా వచ్చిందన్నారు. అవసరమైన రైతులకు ఆధార్, పాసుపుస్తకం పరిశీలించి బస్తా రూ.266.50 చొప్పున విక్రయించడం జరుగుతుందన్నారు. యూరియా లోటు ఎక్కడా లేదని, అవసరమైన రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు పంటల సాగులో తగిన మోతాదులో ఎరువులు వాడాలని, సేంద్రీయ పద్ధతులు పాటిస్తూ పంటల సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, ఏవో విజయభాస్కర్, సీఈవో ఆర్ పోలయ్య, సొసైటీ డైరెక్టర్ నల్లిపోగు రాజా, టీడీపీ నాయకులు నారాయణ, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



సోమశిలలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏడీ దేవసేనమ్మ

అనంతసాగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, అనంతసాగరం రేవూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఏడీ దేవసేనమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో శైలజాకుమారి, ఏఈవో కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో



ఆత్మకూరు: మహిమలూరులో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో పి రఫీఖాన్

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో పి రఫీఖాన్ తెలిపారు. మండలంలోని మహిమలూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధార్ కేంద్రంలో నూతన ఆధార్‌కార్డులు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, ఐరిష్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కావున మహిమలూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలే కాకుండా పరిసర ప్రాంతాల వారు సైతం ఈ ఆధార్‌కేంద్రం సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈనెల 13వ తేదీన అప్పారావుపాళెం, 14న మహిమలూరు, 15న కరటంపాడు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి విజయ్, టీడీపీ నాయకులు వల్లూరు వెంకట రమణారెడ్డి, మద్దినేని నారాయణ పాల్గొన్నారు.

14 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాల ఏర్పాటు

ఏఎస్ పేట: ఆధార్‌కార్డులు లేని షెడ్యూల్ తెగల వారి కోసం ఈనెల 14వ తేదీ నుంచి 18 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీవో ప్రసన్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన అనుమసముద్రం, కొండ మీద కొండూరు, రాజవోలు సచివాలయం పరిధిలోని వారికి అనుమసముద్రం సచివాలయంలో, 15న ఏఎస్‌పేట, చౌటభీమవరం, పెద్దహబ్బీపురం వారికి ఏఎస్‌పేట సచివాలయంలో, 16న కావలి యడవల్లి, జమ్మవరం, గుంపర్లపాడు వారికి కావలి యడవల్లి సచివాలయంలో, 17న చిరమణ, శ్రీకొలను వారికి చిరమణ సచివాలయంలో, 18న గుడిపాడు వారికి సచివాలయంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని మండలంలోని షెడ్యూల్ తెగల వారు వినియోగించుకోవాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి కోరారు.

C.R.I.M.E N.E.W.S

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్‌లో ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా వల్లూరుకు చెందిన బొమ్ము నరేష్‌కుమార్ (41) సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అయితే తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతానంటూ భార్యకు తరచూ చెప్పేవాడని, ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె గమనించి తల్లికి సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోగోలులో దొంగల హల్‌చల్

బిట్రగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని బృందావనం, కుమ్మరవీధుల్లో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గత ఏడాది బృందావనంలో ఏకంగా ఐదు ఇళ్ళలో దొంగలు జొరబడి రెండు ఇళ్లలో చోరీలు చేసిన సంఘటన తెలిసిందే. దీంతో అప్రమత్తంగా ఉన్నామని స్థానికులు తెలిపారు. అయితే కుమ్మరవీధి చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో బైక్ చోరీకి గురైందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితుడు గుర్రంకొండ వంశీ తెలిపారు.

ఘాట్ రోడ్డుపై భారీ వాహనం బోల్తా

● స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన ఐరన్ లోడ్

సీతారామపురం, అక్టోబర్ 10 (ఆంధ్ర జ్యోతి): సీతారామపురం - పోరుమామిళ్ళ ఘాట్ రోడ్డులో ఐరన్ లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనం శుక్రవారం బోల్తా పడింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్ళ నుంచి ఐరన్ లోడ్‌తో కనిగిరికి వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడు ఇచ్చేందుకు మలుపు తిప్పే క్రమంలో బోల్తాపడింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జేసిబి, క్రేన్ల సహాయంతో లారీని పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

దుత్తలూరు (ఉదయగిరి), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ చింతలగుంట గ్రామ సమీపాన 565 జాతీయ రహదారిపై కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దుగ్గినబోయిన పెదబాలనరసింహులు (70) రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ నుంచి పామూరు వైపు వెళుతున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో అతన్ని ఢీకొట్టడంతో కారు బోల్తాపడింది. అనంతరం స్థానికులు అక్కడికి చేరుకుని కారును ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు. అయితే పెదబాలనరసింహులను కారు ఢీకొన్న విషయం ఎవరూ గమనించలేదు. సాయంత్రమైనా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానం వచ్చి కారు ప్రమాదం జరిగిన ప్రదేశంలో చూడగా అతని పాదరక్షలు కనిపించాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టగా చెట్లపొదల్లో అతను విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్థులు బయటకు తీసి గమనించగా మృతిచెంది ఉన్నాడు. గ్రామస్థులు సమాచారాన్ని పోలీసులకు అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు



సీతారామపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సుబ్బయ్య అనే వ్యక్తి శుక్రవారం మద్యం మత్తులో ఉదయగిరి నుంచి మోటార్‌సైకిల్‌పై వస్తూ ఎస్ఆర్ నగర్ వద్ద రోడ్డు దాటుతున్న మౌలాలి అనే వ్యక్తిని ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వారిని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వారంపాటు 32 రైళ్ల రద్దు

● వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

● గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..

● డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతు పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు ఈ నెల 11 నుంచి 18 వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ -డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ, విశాఖపట్నం-న్యూఢిల్లీ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం -సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయ ల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేండ్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జతసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్‌మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేజర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్‌శాఖ అధికారి తెలిపారు. 33 కే.వి లైన్ మెయింటెనెన్స్‌తో పాటు, విద్యుత్ లైన్‌లకు తగులుతున్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 540

విత్తన తయారీ, ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

కావలి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని విత్తన తయారీ, ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారిణి లలిత మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభం అవుతున్నందున నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుదాణదారులను హెచ్చరించారు. 53 వరి విత్తన నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాల పరీక్షకు పంపించారు. సిరి సీడ్స్, నాగార్జున సీడ్స్ విత్తన తయారీ కేంద్రాల్లో రికార్డులు తనిఖీ చేశారు. సీఐ ఎస్‌కే సుబానీ, విజిలెన్స్ ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

లింగసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరెడ్డి వైసీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, వీ వెంకటేశ్వర్లు, సర్పంచులు మల్లికార్జున, ఒంటేల శ్రీనివాసులు, మాజీ సర్పంచు సీహెచ్ శ్రీనివాసులు, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలిగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణ పరిధిలో శనివారం ఉదయం 9నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో-1 రవికుమార్

కొండాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ ఆదర్శ ప్రాథమిక, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-1 కే రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సమగ్ర వివరాలను రికార్డులలో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు.

సీజేఐపై దాడి యత్నం కేసులో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

కావలి (టౌన్) అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి కేసులో రాష్ట్రపతి జోక్యం చేసుకుని మతోన్మాది రాకేశ్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్ళూరు మాల్యాద్రి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదులు రాజ్యాంగాన్ని లెక్కచెయ్యడం లేదని, సుప్రీం కోర్టులో ఏకంగా ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం మతోన్మాదానికి పరాకాష్ట అన్నారు. కార్యక్రమంలో నేతలు రాధాకృష్ణ, సాయిరామ్‌సింగ్, శ్రీనివాసులు, జాన్, మధు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నేతలు

బీసీ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

అల్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అల్లూరులోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను అల్లూరు ఎంపీడీవో రజనీకాంత్ శుక్రవారం తనిఖీ చేశారు. గత వారం రోజులుగా ఉపాధ్యాయురాలి తొలగింపు విషయమై నెలకొన్న వివాదం నేపథ్యం లో విద్యార్థులు నిరసనకు దిగే పరిస్థితి నెలకొనడంతో ఎంపీడీవో పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎల్ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌డీవోగా పాండు రంగారావు

● ఖోఖో కోచ్‌గా ఆర్‌కే యతిరాజ్



పాండురంగారావు

నెల్లూరు(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా ఫుట్‌బాల్ కోచ్ ఎం.పాండురంగా రావును నియమిస్తూ శాప్ ఎండీ ఎస్.భరణి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాల డీఎస్‌డీవోల బదిలీల్లో భాగంగా నెల్లూరు డీఎస్‌వోలో సీనియర్ ఫుట్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న పాండురంగారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఎస్‌డీవోగా నియమించారు. ప్రస్తుతం డీఎస్‌డీవోగా పని చేస్తున్న ఆర్‌కే.యతిరాజ్ త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయనను నెల్లూరు డీఎస్‌వోలోనే ఖోఖో కోచ్‌గా నియమించారు. గతంలో డీఎస్‌డీవోగా పనిచేసిన అనుభవంతోపాటు జిల్లాలో పాండు రంగారావు సీనియర్ కావడంతో ఆయనను జిల్లా అధికారిగా నియమించారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు!



కావలి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా రోడ్లపై గుంతలు ఉండకూడదని, ఎక్కడైనా ఉంటే మరమ్మతులు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల అధికారులను ఆదేశించారు. అయితే ఎక్కడో మారుమూల గ్రామాలలో ఉన్న గుంతలు సరే... కావలిపట్టణ నడిబొడ్డున ఉన్న గుంతల సంగతేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఆర్వోబీ వంతెనకు ఉత్తరం వైపున ఉన్న రోడ్డు గుంతలమయమైంది. ఏరియా వైద్యశాల నుంచి రైల్వేరోడ్డు మలుపు వరకు ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రంకు రోడ్డు నుంచి ప్రభుత్వ వైద్యశాల మధ్య వరకు సుమారు రూ.50 లక్షలతో విశాలంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే అక్కడ నుంచి మిగిలిన రోడ్డును పట్టించుకోక పోవటంతో గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులు, ప్రజలు భయపడుతున్నారు. దీంతో రోడ్డు ప్రారంభంలో వేసిన సీసీ రోడ్డు మాత్రం ఆటోలకు పార్కింగ్ ప్రదేశంగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో అత్యంత రద్దీగా ఉన్న ఈ రోడ్డులో సీసీ రోడ్డు వేయటం ఆలస్యమైనా కనీసం రోడ్డు మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవినీతి సహించం

● జలదంకి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు అప్పలనాయుడు

జలదంకి, అక్టోబర్ 10 (ఆంధ్ర జ్యోతి): ఆరుగాలం కష్టపడే రైతులకే ప్రభుత్వ మద్దతు ధర దక్కాలని, అలాకాకుండా దళారీలకు మేలు చేకూర్చేలా అవినీతికి పాల్పడితే సహించేది లేదని జలదంకి పీఏసీ ఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు సిబ్బందిని హెచ్చరించారు. జలదంకిలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో అప్పలనాయుడు మాట్లాడారు. బ్రాహ్మణక్రాక పీపీసీ కేంద్రంలో ధాన్యం గోతాలు మాయం చేసిన సొసైటీ సెక్రటరీ పంతగాని ప్రవీణ్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మండలంలో ధాన్యం పండించిన రైతులకు రోజువారీ 5 వేల గోతాలు కేటాయిస్తే, వాటిని బోగోలు మండలం తాళ్ళూరు వీఏఏ ప్రతాప్‌నకు బ్రాహ్మణక్రాక పీపీసీ కేంద్రం నుండి ఎలా చేరవేస్తారని ఆయన ప్రశ్నించారు. రైతులకు అందాల్సిన గోతాలను పక్కదారి పట్టించడం మంచి పద్ధతి కాదన్నారు. మండలంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషితో జలదంకి, బ్రాహ్మణక్రాక గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు జలదంకి సొసైటీ తరపున ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ఈ రెండు కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు అప్పలనాయుడు

ముమ్మరంగా మంచినీటి పథకం మరమ్మతు పనులు



రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్

లింగసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి చెందిన పెంట్రాలలో ఉన్న ట్రీట్‌మెంటు ప్లాంటులో మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ మంచినీటి పథకం నుండి కలుషిత నీరు వస్తుండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గత బుధవారం నుంచి మంచినీటి సరఫరా నిలిపి వేసి ప్లాంటులో మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ కారణంగా ఈనెల 13వ తేదీ వరకు మంచినీటి సరఫరాను 48 గ్రామాలకు నిలిపి వేశారు. శుక్రవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సీహెచ్ రాజశేఖర్ వాటర్ ప్లాంటులో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.10 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టినట్టు తెలిపారు. వీలైనంత వరకు ఈ మరమ్మతు పనులు ఈనెల 13కు పూర్తి చేసి 14వ తేదీన మంచినీటి సరఫరాను పునరుద్ధరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రన్న

కావలి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కావలిలో ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. తెలుగువారి గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేశాన్నారు. టెక్నాలజీకి పునాదులు వేసిన చంద్రబాబు సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. దూరదృష్టి కలిగిన అగ్రశ్రేణి నాయకుడి సారథ్యంలో పనిచేయటం తనకెంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రికి ఆయన అభినందనలు తెలిపారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన అవసరం

ఉలవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే రమాదేవి సూచించారు. శుక్రవారం రామాయపట్నం హైస్కూల్‌లో పోషణ్ మహాలో భాగంగా కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, బాల్య వివాహాలు, పోషక విలువలు, ఆరోగ్య భద్రత, ఉన్నత విద్యాభ్యాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీజి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు ప్రసన్న, లక్ష్మీ, మరియమ్మ, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

సోమశిలకు 12,319 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 13,319 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 72.411 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీ వద్ద శుక్రవారం నీటి ప్రవాహం తగ్గింది. దీంతో నీటిమట్టం 10 అడుగుల నుంచి 9.3 అడుగలకు తగ్గింది. ఇక్కడ నుంచి నెల్లూరు బ్యారేజీకి 12వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



సంగం బ్యారేజీ వద్ద దిగువకు పారుతున్న పెన్నా జలాలు

మత్స్యకారుల సహకారంతో తీరప్రాంత భద్రత పటిష్టం

● మెరైన్ సీఐ శివన్నారాయణ



తీరప్రాంత భద్రతపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

ఉలవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సహకారంతో తీర ప్రాంత గ్రామాల్లో భద్రత పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు రామాయపట్నం మెరైన్ సీఐ జీ శివన్నారాయణ అన్నారు. శుక్రవారం చాకిచర్ల చిన్నపట్టపుపాలెంలో సముద్ర తీరం భద్రతపై మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. సముద్ర మార్గాన మన దేశంలోకి ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా చేయడంలో, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో మత్స్యకారుల సహకారం అవసరమన్నారు. అలాగే తీరప్రాంతం వెంబడి తాటిచెట్లు పెంపకం, వాటివలన ఉపయోగాలు, ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ప్రాముఖ్యత, వాటి సంసరక్షణపై అవగాహన కలిగించారు. అదేవిధంగా వేట సమయంలో సముద్రంలో కొత్తవ్యక్తులు, బోట్లు కనిపించిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ టోల్‌ఫ్రీ నెంబరు 1093కి, కోస్టగార్డు టోల్‌ఫ్రీ నెంబరు 1554కి వెంటనే సమాచారం అందించాలన్నారు. కడలూరు బోట్ల సమస్య గురించి మత్స్యకారులు ఈ సందర్భంగా ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్సై ఈశ్వరయ్య, ఎఫ్‌డీవో లక్ష్మణ్ నాయక్, ఎఫ్‌ఎస్‌వో బ్రహ్మానాయుడు, ఆర్‌ఐ ప్రభావతి, రామాయపట్నం పోర్టు ఏఈఈ శ్యామ్ ప్రసాద్, వీఆర్వో మోహన్‌రావు, సచివాలయం సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఖతర్‌లో ముస్లిం యువతకు ఉద్యోగావకాశాలు : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ముస్లిం మైనారిటీ యువతకు రాష్ట్రప్రభుత్వం తరపున ఖతర్ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఓవర్సీస్ మాన్యన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ ద్వారా దోహలో హోమ్‌కేరేనర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. అర్హులైన యువతీ యువకులు రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యం లింక్ ద్వారా ఈనెల 12లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సకాలంలో రిజిస్టర్ చేసుకోలేనివారు 13న ఉదయం 10 గంటలకు విజయవాడలోని గవర్నమెంటు ఐటీఐ క్యాంపస్‌లో ఓఎంసీఏపీ కార్యాలయంలో హాజరైనా సరిపోతుందని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు

కందుకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడమే గాక రైతుబిడ్డలను ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా పదిహేనేళ్ల కాలాన్ని చంద్రబాబు నాయుడు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఎమ్మెల్యే ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రప్రజల అభ్యున్నతి, యువత భవిష్యత్తు కోసం ఆయన నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, విద్య, వ్యవసాయం అన్నిరంగాల్లో రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీయటానికి కారణమైన వ్యక్తి చంద్రబాబునాయుడు అని, ఆయన సాన్నిధ్యంలో పనిచేయటం గర్వకారణంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులిస్తున్న చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పోలేరమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

బిట్రగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో పోలేరమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యుల సహకారంతో శుక్రవారం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల గ్రీస్ పూసిన సంఘటనపై కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్ఐ ప్రభాకర్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగానే ఆలయాల ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు స్థానికులను హెచ్చరిస్తున్నారు.

నేరాలకు కేరాఫ్ నెల్లూరు!

- బీహార్‌ను తలపించేలా ఘటనలు
- నగదు కోసం కిరాతకంగా హత్యలు
- రాత్రి ఏడు దాటితే రోడ్లపై తిరగాలంటే భయం
- పోలీసులకు సవాళ్లు విసురుతున్న పాత నేరస్థులు
- నిద్రపోతున్న నిఘా నేత్రాలు
- పాత నేరస్థులపై దృష్టి సారించే వారేరీ?
- వెలుగులోకి వస్తున్నవి కొన్నే.. చీకట్లో మరెన్నో..
- నెల రోజుల్లోనే మళ్లీ జంట హత్యలు



ఈ నెల 7న హత్యకు గురైన వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు జిల్లా కొన్నేళ్లుగా నేరాలకు అడ్డాగా మారింది. బీహార్ వంటి రాష్ట్రాలకు పరిమితమైన కత్తులతో బెదిరించి దోపిడీలు చేసే కల్చర్ నెల్లూరులో ప్రారంభమైంది. ఒంటరిగా వెళ్లే ప్రజలను లక్ష్యంగా చేసుకొని మార్గమధ్యలో అడ్డగించి దోపిడీలకు పాల్పడుతున్నారు. వారు నగదు ఇవ్వను అంటే విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేస్తున్నారు. నగరంలో వరుసగా జరుగుతున్న ఇలాంటి సంఘటనలు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఈనెల 6వ తేదీ రాత్రి పెన్నా బేరేజ్ సమీపంలో జరిగిన జంట హత్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పలువురు యువకులు మత్తులో కత్తులను బైక్‌లలో, ఫ్యాంట్ జేబుల్లో, బొడ్డులో, వీపు వెనుక ఫ్యాంట్‌లో, దాచుకొని తిరుగుతూ ప్రజలకు వాటిని చూపి నగదు ఇవ్వాలంటూ బెదిరిస్తూ దోచుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో లేడీ డాన్ అరుణ, రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించిన తర్వాత పోలీసులు రౌడీ మూకలపై లాఠీ ఝులిపించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో రౌడీ షీటర్లు పలు కేసుల్లో జైలుకు పోవడం, నిరంతర తనీఖీలు చేయడంతో కొంత కాలం నేరాలు కట్టడిలోకి వచ్చాయి. అయితే నగరంలో నగదు కోసం జరిగిన జంట హత్యలు సంచలనంగా మారడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. మనం నెల్లూరులో ఉన్నామా... బీహార్ వంటి ప్రాంతాల్లో ఉన్నామా అని చర్చించుకుంటున్నారు. ఏడాది కాలంలో పలు కారణాల వల్ల పదుల సంఖ్యలో హత్యలు జరిగాయి. ప్రధానంగా నగరంలో గడిచిన ఏడు నెలల కాలవ్యవధిలో 20కి పైగా హత్యలు జరిగాయి. కత్తులను చూపించి బెదిరించడం ఫ్యాషన్‌గా మారిపోయింది. ప్రేమికులు, ఫూట్‌గా మద్యం సేవించిన వారు, ఎస్-2 రోడ్డులో హిజ్రాల వద్దకు వెళ్లేవారు, లాడ్జీల నుంచి బయటకు వచ్చే వారు, అర్ధరాత్రి మద్యం సేవించి వెళ్లే మందుబాబు లను మాత్రమే టార్గెట్ చేస్తూ కత్తులను చూపించి కొందరు దొరికిన వరకు దోచేస్తున్నారు. ఈ విషయాలను బాధితులు బయటకు చెప్పు కునేందుకు, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేస్తే పరువు పోతుందన్న భావనతో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో అనేక సంఘటనలు చీకటిలోనే ఉండిపోతున్నాయి.

● కత్తులతో తిరగడం నగరంలో స్టైల్

ప్రస్తుతం నగరం నేరాలకు అడ్డాగా మారింది. ఈ క్రమంలోనే యు వత, నేర చరిత్ర కలిగిన వారు ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో తల్లిదండ్రులకు వెళ్లి వస్తామని చెప్తారో లేదో తెలియదు కాని తాము ఇష్టంగా కొనుగోలు చేసిన కత్తులను మాత్రం తమ వెంట తీసుకురావడం మరవడం లేదు. చిన్నచిన్న గొడవలకు కత్తులను బయటకు తీసి వేసేస్తా అంటూ బూతులు తిడుతూ తగ్గేదేలా అంటూ సినిమా డైలాగ్‌లు కొడుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో వరుసగా జరుగుతున్న సంఘటనలతో ప్రజలు ఒంటరిగా వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు.

● నిఘా నిద్రపోతుండటంతో..

పోలీసు నిఘా నిద్ర పోతుండటంతో వరుస నేరాలను జరుగుతు న్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు స్టేషన్‌లలో ఉన్న క్రైమ్ పార్టీలు ఆయా స్టేషన్‌లలో ఏళ్ల తరబడి పాతుకు పోవడంతో నేరస్థులకు అండగా ఉండటంతో పలుమార్లు నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్థులపై నిఘా ఉంచడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణ లు ఉన్నాయి. ఇక రాత్రి పూట బీట్ సైరన్‌లకే పరిమితం అవుతోందని, నాయకుల సిఫార్సులతో నేరాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో హత్యలతో పాటు మోసాలు, స్కామ్‌లు, ఇలా చెప్పుకుంటూ పోతే నేరాలకు అడ్డా అన్న పేరు వచ్చేసింది. ఈ క్రమంలో నేరాల కట్టడికి కొత్తగా వచ్చిన ఎస్పీ ఇప్పటి వరకు ప్రత్యేక కార్యాచరణ చూపక పోవడం ప్రజలను భయాందోళలకు గురిచేస్తోంది.

త్వరలో మరిన్ని..

(5వ పేజీ తరువాయి)

సందర్శించారు. తొలుత సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థుల ప్రార్థనల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల కంప్యూటర్ నైపుణ్యాన్ని, విద్యార్థుల మ్యాథ్స్, సైన్స్ ప్రదర్శనలను స్వయంగా పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా వారు సమాధానం చెప్పడంతో ఎక్సలెంట్ అంటూ పొగిడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని నడుచుకోవాలని సూచించారు. పిల్లల్లో మంచి ఆత్మవిశ్వాసాన్ని, ఒక నమ్మకాన్ని కల్పిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థులందరికీ 'ఆల్ ద బెస్ట్' అని చెప్పి అక్కడ నుంచి బయలుదేరి పక్కనే ఉన్న నంది పవర్ ట్రెడ్ మిల్ మిషనరీని, గోశాలను ప్రారంభించారు.. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎడ్ల సంతతి, వాటి జాతుల గురించి నిర్వాహకులు సీఎంకు వివరించారు. ఎడ్ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్ (నంది పవర్ బుల్ ప్రాజెక్టు)ను ఆసక్తిగా సీఎం తిలకించారు. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించి సందర్శించారు. అక్కడి నుంచి సభ ప్రాంగణానికి చేరుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు చింతా శశిధర్ ఫౌండేషన్ చైర్మన్ చింతా శశిధర్ స్వయంగా జ్ఞాపికను అందజేశారు.



నందగోకులం లైఫ్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



అదరగొట్టిన శివమణి

చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం రాత్రి 'మోహన మంత్ర'లో భాగంగా నిర్వహించిన డీజే కార్యక్రమం అదరగొట్టింది. డ్రమ్స్ శివమణి తన సంగీతంతో విద్యార్థులను ఉర్రూతలూగించారు.

ఎస్వీయూకు మొదటి స్థానమే లక్ష్యం

● వీసీగా బాధ్యతలు స్వీకరించిన నరసింగరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీని మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యమని నూతన వీసీ నరసింగరావు పేర్కొన్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ వీసీ పదవి దక్కడం పూర్వజన్మ సుకృతమన్నారు. బొబ్బిలి సమీప గ్రామం నుంచి వచ్చిన తాను బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ చేశానన్నారు. ప్రొఫెసర్‌గా, పాలనారంగంలో పనిచేసిన అనుభవంతో ఎస్వీయూ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవితఖైదు

సూళ్లూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 2019 నాటి గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. సూళ్లూరుపేట బొగ్గుల కాలనీకి చెందిన తిరువళ్లూరు నవీన్‌కుమార్, సాయినగర్‌కు చెందిన కేకుల దేవకు జీవిత ఖైదుతో పాటు నగదు దోపిడీకి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు ప్రేమించుకుంటున్నారు. 2019 ఫిబ్రవరి 3న రాత్రి 10.30 గంటల సమయంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ చివర్లో కూర్చొని వీరు పెళ్లి విషయమై మాట్లాడుకొంటున్నారు. అదే సమయంలో నలుగురు యువకులు అతడిపై దాడిచేసి నగదు లాక్కున్నారు. ఆ యువతిని కాస్త దూరం లాక్కెళ్లి గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. మళ్లీ ఆమెను తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసి పరారయ్యారు.అప్పట్లో ఈ గ్యాంగ్ రేప్ సూళ్లూరుపేటలో సంచలనం రేపింది. అప్పటి సీఐ కిషోర్ బాబు,పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ మురళీకృష్ణ, కోర్ట్ లైజన్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్కే ఖాజాహుస్సేన్ సాక్ష్యాలను సరైన సమయంలో సమర్పించి నేరం రుజువు కావడానికి కృషి చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫీ మాలిక్ వాదనలు వినిపించారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.



మానవ మృగాలకు సరైన శిక్షే పడింది

ఆరేళ్ల కిందట గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ఇద్దరికి జీవిత ఖైదు శిక్ష పడడంతో 'మానవ మృగాలకు సరైన శిక్షే పడింది' అని స్థానికులు అంటున్నారు. బాధితురాలికి కొంతవరకు న్యాయం జరిగిందని చర్చించుకున్నారు. ప్రియుడి కళ్లెదుటే అత్యాచారానికి పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో అప్పట్లో మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. ఈ ఘటనను నిరసిస్తూ ఒక ఉద్యమం నడిచింది. పోలీసులూ రంగంలోకి దిగి మరుసటి రోజే నిందితులను పట్టుకున్నారు. అప్పటి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి వచ్చి బాధిరాలిని పరామర్శించారు. మావన మృగాలకు త్వరగా శిక్షపడేలా చూస్తామన్నారు. ఈ ఘటనతో అప్పటి సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నలుమూలల నుంచి సూళ్లూరుపేటకు పోలీసులు, స్పెషల్ ఐడిపార్టీ రప్పించి పరిశ్రమలు, బాలికల పాఠశాల, హాస్టల్స్, రైల్వేస్టేషన్ సమీపాల్లో పోలీసుల గస్తీపెంచారు. దాదాపు రెండు నెలల పాటు ఈ ప్రాంతంలో పోలీసు గస్తీ ఉంది. ఈ క్రమంలో ఇద్దరికి జీవత ఖైదు పడటంతో సరైన శిక్షే పడిందని అంటున్నారు.



నిరీక్షించి.. నీరసించి..!

షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్

పూర్తి స్థాయిలో చూపని ఖాళీల జాబితా

విద్యాశాఖ అతధికారుల నిర్లక్ష్యంతో కొత్త టీచర్ల అవస్థలు

తిరుపతి (విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్‌తో గంటలకొద్దీ నిరీక్షిస్తూ కొత్త టీచర్లు ఇబ్బంది పడ్డారు. ఇందులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమూ కనిపిస్తోంది. మెగా డీఎస్సీ కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన 1403 మంది టీచర్లలో 1394 మంది చిత్తూరు, తిరుపతి, గూడూరులోని ఆరు కేంద్రాల్లో ఎనిమిది రోజుల పాటు.. అక్కడే ఉండి శుక్రవారంతో శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ కాలంలోనే చివరి రెండు రోజులు వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి, వీరికి పోస్టింగులు కేటాయించాలి. దీనికిగాను ఎస్జీటీలకు గురువారం మధ్యాహ్నం 3 నుంచి మాన్యువల్, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో మాత్రం దీనికి భిన్నంగా జరగడం.. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఎందుకంటే.. తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్‌లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లను తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు పూర్తి చేశారు. కౌన్సెలింగ్ నిర్వహణకు లాగిన్ అధికారమున్న చిత్తూరు డీఈవో వరలక్ష్మి వివిధ కారణాలతో రాత్రి 10.30 గంటలకు వచ్చారు. దీంతో అర్ధరాత్రి 11 గంటల తర్వాత మొదలై.. శుక్రవారం వేకువ జాము 4 గంటలకు వరకు 250 మందికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన వారికి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు తిరుపతి రూరల్ ప్రాంతంలోని మెడ్‌జీ స్కూల్లో 450 మందికి కౌన్సెలింగ్ ప్రారంభించాలి. కానీ, 4.30 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలు పెట్టి రాత్రి పది గంటలకు కౌన్సెలింగ్ పూర్తయింది. ఇక, గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో 175 మంది ఎస్జీటీలకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్లకు మూడు గంటలు ఆలస్యంగా.. సాయంత్రం 6 గంటలకు మొదలైన వెబ్ కౌన్సెలింగ్ రాత్రి 11.30 గంటల వరకు కొనసాగింది. ఇలా షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ జరగకపోవడానికి సాంకేతిక సమస్యలూ కారణమని అధికారులు చెబుతుండటం గమనార్హం.

ఖాళీలు చూపడంలోనూ స్పష్టత కరువు

ఉమ్మడి జిల్లాలోని టీచర్ పోస్టుల ఖాళీలను పూర్తిగా చూపలేదు. హెచ్‌ఆర్ఏ 16శాతం, 12 శాతం వచ్చే రెండు కేటగిరిల్లో (కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో) 500 ఖాళీలను బ్లాక్ చేశారు. వీటిల్లోనే టీచర్ పోస్టుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. నగరాలు, పట్టణాల్లో కనీసం 400 ఖాళీలైనా కొత్త టీచర్లతో భర్తీ చేసుంటే ఈ ప్రాంత విద్యార్థులకు కొంతవరకైనా న్యాయం జరిగేది. అలా కాకుండా కొత్త టీచర్లందరినీ మూడు నాలుగు హెచ్‌ఆర్ఏ కేటగిరి పరిధిలోకి వచ్చే మండల స్థాయిలోని గ్రామీణ పాఠశాలలకే పరిమితం చేశారు. ఈ ఖాళీలు మాత్రమే జాబితాలో చూపారు.

స్థానాల జాబితాలో తారుమారు

కౌన్సెలింగ్ పక్రియలో సర్వర్లు బిజీగా ఉండటంతో కౌన్సెలింగ్ ఆలస్యానికి మరో కారణంగా తెలుస్తోంది. మరో వైపు కొన్ని ప్రాంతాల ఖాళీలు తప్పుగా నమోదు కావడం,వాటిని సవరించేందుకు సాంకేతిక సిబ్బంది సమయం తీసుకోవడంతో ఇటు విద్యాశాఖ అధికారులు, అటు కొత్త టీచర్లు తలలు పట్టుకున్నారు. ఖాళీలను ప్రచురించిన జాబితాలో పారదర్శకత లేకపోవడంతోనూ కొత్త టీచర్లు విస్తుపోతున్నారు.

ఒత్తిడికి గురై పడిపోయిన చిత్తూరు డీఈవో

చిత్తూరు సెంట్రల్/తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: ఎస్జీటీలకు స్థానాల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియలో ఒత్తిడికి గురైన చిత్తూరు డీఈవో వరలక్ష్మి.. శుక్రవారం మధ్యాహ్నం గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో మెట్లు ఎక్కుతూ పడిపోయారు. ఈ కాలేజీలో 175 మంది ఎస్జీటీ (తమిళం, ఉర్దూ ల్యాంగ్వేజస్)లకు ఉదయం 8.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కావాలి. డీఈవో సకాలంలో వెళ్లకపోవడం, సాంకేతిక కారణాలతో రాష్ట్ర ఐటీ సెల్ నుంచి టీచర్ల కేటాయింపు స్థానాలు డిస్ప్లే కాలేదు. దీంతో మధ్యాహ్నం వరకు మొదలు కాలేదు. దీనిపై విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు ఆర్జేడీపై.. కడప నుంచి ఆయనతోపాటు కమిషనరేట్ అధికారులూ డీఈవో వరలక్ష్మిపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఆ కళాశాల ప్రాంగణంలో ఒక చోట మెట్టు ఎక్కబోతూ డీఈవో ఉన్నపాటున పడిపోయారు. సిబ్బంది హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించి స్కానింగ్ చేయించారు. ప్రాథమిక వైద్యం అందించగా, డీఈవో కోలుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత కౌన్సెలింగ్‌ను మొదలుపెట్టి సాయంత్రం ఆరు గంటలకు పూర్తి చేశారు.

విషాదం నింపిన అతివేగం

● గరుడవారధిపై నుంచి పడి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై అతివేగంతో వచ్చిన ఇద్దరు యువకులు.. అదుపు తప్పి తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి పడి దుర్మరణం చెందారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు.. చంద్రగిరి మండలం కందులవారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్ నాయుడి ఏకైక కుమారుడు కనిష్క(22), ఇతడి స్నేహితుడు, కొటాలకు చెందిన వాచువా కొమ్మినేని(23) చంద్రగిరి మండంలోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నారు. వీరిద్దరూ శుక్రవారం మధ్యాహ్నం చంద్రగిరి నుంచి బుల్లెట్‌లో బయలుదేరి.. మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. అతివేగంగా వస్తున్న వీరు లక్ష్మీపురం సర్కిల్ వద్ద అదుపు తప్పి ఎడమ వైపు వున్న గ్రిల్ డివైడర్‌ను ఢీ కొన్నారు. దాదాపు రెండు అడుగుల ఎత్తు ఎగిరి వారధిపైనుంచి దాదాపు 30 అడుగుల కింద రోడ్డుపై పడ్డారు. ఒకరు వినాయకస్వామి గుడి వద్ద, మరొకరు పెట్రోలు బంకు వద్ద పడి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి, ఏఎస్ఐ అశోక్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 108లో మృత దేహాలను రుయా స్పత్రికి తరలించారు.కనిష్క బావ సురేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు. బుల్లెట్‌ను పోలీసులు సీజ్ చేశారు. రుయా అత్యవసర విభాగం వద్ద ఇద్దరు కుటుంబీకులు, బంధువులు, తోటి విద్యార్థుల రోదనలు అందరినీ కలచివేసింది.



కనిష్క వాచువా కొమ్మినేని (ఫైల్ ఫొటోలు)

తిరుపతిలో ఒబెరాయ్ రిసార్ట్‌కు 20 ఎకరాలు

నాయుడుపేటలో కార్బన్ బ్లాక్ పెట్టుబడి సవరణ

పర్యాటక, పరిశ్రమల శాఖల ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం

తిరుపతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఒబెరాయ్ విల్లాస్ రిసార్ట్‌కు 20 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాయుడుపేట సెజ్‌లో ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ ప్రతిపాదించిన పెట్టుబడిని తగ్గించుకునేందుకూ అంగీకరించింది. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 32వ ఇ-క్యాబినెట్ సమావేశంలో జిల్లాకు సంబంధించి నిర్ణయాలు తీసుకున్నారు. తిరుపతిలోని అలిపిరి-చెర్లోపల్లి రోడ్డుకు ఉత్తరంగా ఒబెరాయ్ సంస్థకు గత ప్రభుత్వం 20 ఎకరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ సంస్థ ప్రతినిధులు తమ గ్రూపుల్లో ఒకటైన ముంతాజ్ హోటల్స్ పేరిట బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో హిందూయేతర సంస్థగా భావించిన పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దీన్ని వ్యతిరేకించారు. ఒబెరాయ్‌కు భూ కేటాయింపులు రద్దు చేసి.. ఆ భూమిని టీటీడీకి అప్పగించాలని కోరుతూ పాలకమండలి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించారు. ఈ క్రమంలో తిరుమలకు వచ్చిన సీఎం చంద్రబాబు ఆ భూ కేటాయింపులు రద్దు చేసి, ఆ సంస్థకు మరోచోట భూములు కేటాయిస్తామని ప్రకటించారు. ఆ ప్రకారం సర్వే నంబరు 588-ఏలో 20 ఎకరాలకు ఒబెరాయ్‌కు చెందిన ట్రైడెంట్ గ్రూప్ పేరిట కేటాయించడానికి మంత్రిమండలి ఆమోదించింది.

● నాయుడుపేట సెజ్‌లో రూ. 3,718 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటూ మెస్సర్స్ ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనికి 116.62 ఎకరాలను కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇటీవల ఆ సంస్థ తమ పెట్టుబడిని రూ.2,717 కోట్లకు తగ్గించుకుంటామంటూ ప్రతిపాదనలు పంపగా.. దానికనుగుణంగా ఇతర మినహాయింపులు, రాయితీలలో కూడా సవరణలను మంత్రివర్గం ఆమోదించింది.

కొడుకునైనా కాపాడుకోగలిగాం



విమానం నుంచి గుండెను తీసుకొస్తూ..

వారిది సత్యవేడు ప్రాంతం. నిరుపేద కుటుంబం. వీరి పెద్ద కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ కొద్ది రోజుల కిందటే మృతిచెందింది. మరోవైపు 14 ఏళ్ల కొడుకూ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కనీసం కొడుకునైనా కాపాడుకోవాలని ఆ తల్లిదండ్రులు తపన పడ్డారు. ఆ బాలుడిని నెల రోజులుగా ఆస్పత్రిలోనే ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇతడికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించి వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్లో నమోదు చేశారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన పి.విజయకృష్ణ(28) రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురై అవయవదానానికి సిద్ధంగా ఉన్నారనే విషయం తెలిసింది. తిరుపతి నుంచి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి బృందంతో వెళ్లి గ్రీన్ ఛానల్ ద్వారా విమానంలో.. ఎయిర్‌పోర్టు నుంచి అంబులెన్సులో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయకు గుండెను తీసుకొచ్చారు. దాదాపు 6 గంటలు శ్రమించి గుండె మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు. హమ్మయ్య.. కొడుకునైనా రక్షించుకోగలిగామని ఆ తల్లిదండ్రులు ఊరట చెందారు. ఈ శస్త్రచికిత్సతో ఇప్పటి వరకు 21 విజయవంతంగా పూర్తి చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మరోవారంలో కొలువుదీరనున్న ముక్కంటి ఆలయ బోర్డు

శ్రీకాళహస్తి, అక్టోంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు మారో వారం రోజుల్లో కొలువుదీరనుంది. ఇటీవల ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యుల పేర్లను కూటమి ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు శుక్రవారం అధికారిక జీవోను విడుదల చేశారు. దీంతో మండలి నియామకం ఖరారు అయింది. ఛైర్మన్‌గా కొట్టే సాయిప్రసాద్‌తో పాటు 16మంది సభ్యులు బీల స్రవంతి, చిన్నపూల లక్ష్మీనారాయణ, లక్ష్మమ్మ, జి.గోపీనాథ్, కె.కుసుమ కుమారి, కొమ్మబోయిన రజని, నాగరాజు కొప్పెర్ల, పెనగలూరు హేమవతి, విజయమ్మ, రుద్రాక్షల కౌసల్యమ్మ, దండి రాఘవయ్య, పగడాల మురళి, వి.గురప్పశెట్టి, కోల విశాలాక్షి, ప్రకాష్‌రెడ్డి, కాలే సావిత్రి ఉన్నారు.



నన్ను ఇప్పుడు 'ఓ.జీ' డ్రమ్మర్ అంటున్నారు

● శివమణి

తిరుమల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): 'చెన్నైలో ఉన్నప్పుడు నన్ను అందరు ఏఆర్ రెహ్మాన్ డ్రమ్మర్ అంటారు. ఇప్పుడు కొత్త ట్రెండ్ మొదలైంది. నన్ను చూడగానే 'ఓ.జీ' డ్రమ్మర్ వచ్చేశారు అంటున్నారు' అని డ్రమ్స్ శివమణి సంతోషంగా చెప్పారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం ఆయన దర్శించుకున్న ఆయన మీడియాతో మాటాడుతూ, బాలయ్య 'అఖండ-2' చిత్రం కోసం నేరుగా ముంబై వెళ్తున్నానని చెప్పారు. ఇలా ఉండగా, స్వామి దర్శించుకునే సమయంలో కూడా శివమణి చేతిలో డ్రమ్స్ స్టిక్స్ ఉన్నాయి. దీనిని చాలా మంది ఆసక్తిగా చూశారు.

→ ఆలయం ముందు డ్రమ్స్ స్టిక్స్‌తో శివమణి




స్వాతి (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో స్టాఫ్ నర్సు మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు స్టాఫ్ నర్సు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ ఇన్‌చార్జి సీఐ గోపి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు గ్రామానికి చెందిన గురవయ్య ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంటాడు. ఆయన భార్య స్వాతి(26). ఈమె శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తుండేది. శుక్ర వారం రాత్రి విధులు ముగిసిన అనంతరం గురవయ్య భార్య స్వాతితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణ శివారు అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై వెళతండగా టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో స్వాతి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సాయంతో భర్త ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీక రించారు. భర్త, కుటుంబసభ్యులు బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,883

తలనీలాలు సమర్పించినవారు: 26,000

జిల్లా హౌసింగ్ హెడ్
దయాకర్ సస్పెన్షన్

● మరో 12 మంది కిందిస్థాయి అధికారులపై చర్యలకు సిఫార్సు

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ (ఇన్‌చార్జి) పి.దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఈఈగా, ఈఈగా పనిచేసినప్పుడు కొండ్లపూడి, వెంకటేశ్వరపురం లే-అవుట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టేట్ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడి, హౌసింగ్ కార్పొరేషన్ ఖజానాకు రూ. కోట్లలో నష్టం కల్గించారని, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో కూడా విఫలమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో దయాకర్‌పై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్‌తోపాటు లే అవుట్లలో అవినీతి కార్యకలాపాల్లో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజినీరు పసుపులేటి సురేష్‌కుమార్ ((రిటైర్డ్), గొల్లపూడి రామకృష్ణ (రాపూరు), ఎ.నాగరాజు (అప్పటి డివిజన్ హెడ్-రిటైర్డ్), ఎం.వెంకటమోహనరావు (ప్రస్తుత నెల్లూరు డివిజన్ హెడ్), పల్లా వెంకటదాసు (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్ - కర్నూలు జిల్లాలో పదవీ విరమణ చేశారు), పరవస్తు నరసింహం (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్-రిటైర్డ్), తోట వెంకటశేషయ్య (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్), మొహమ్మద్ జహీరుద్దీన్ అహ్మద్ (ప్రస్తుతం సర్వేపల్లి రూరల్ సబ్ డివిజన్ డీఈఈ), పటాన్ అహ్మద్‌బాషా, (రిటైర్డ్ ఏఈ), తాళ్లూరు భాస్కరరావు (ప్రస్తుతం మనుబోలు మండల ఏఈ), ఎం.మధుసూధనరావు (అప్పటి ఏఈ-ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు), ఎం.కృష్ణారెడ్డి (రిటైర్డ్ ఏఈ)లపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి అదనపు చెల్లింపుల మొత్తాన్ని తిరిగి రాబట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని ఆదేశిస్తూ లేఖ రాశారు.

లైసెన్స్ లేని బాణసంచా కంటైనర్, లారీ సీజ్



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తమిళనాడు శివకాశి నుంచి లైసెన్స్ లేకుండా బాణసంచాతో వచ్చిన కంటైనర్, లారీని తిరుపతి, రేణిగుంట పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడికి అందిన రహస్య సమాచారం మేరకు.. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి సిబ్బందితో కలిసి కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద తనిఖీలు చేపట్టారు. శివకాశి నుంచి కంటైనర్‌లో తెప్పించిన రూ రూ.2.5 లక్షల విలువ చేసే 38 బాక్సుల బాణసంచా కనిపించింది. అదే సమయంలో రేణిగుంటలో పట్టుబడిన లారీలో తనిఖీ చేయగా రూ.2.8 లక్షల బాణసంచా దొరికింది. లైసెన్స్ లేకపోవడంతో రెండింటినీ సీజ్ చేశారు. మిట్టూరు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. లైసెన్సు లేకుండా బాణసంచా తెచ్చినా, విక్రయించినా, నిల్వ చేసినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. అలాంటి సమాచారం అందితే 112కు తెలియజేయాలని కోరారు.

తిరుచానూరు నుంచి మరిన్ని రైళ్లు



సీసీఐ శ్రీకాంత్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి మరిన్ని రైళ్లను నడపనున్నట్లు తిరుపతి చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఆయన సికింద్రాబాదు నుంచి వచ్చిన ప్రత్యేక రైలు ప్రయాణికులను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను పెంచినట్లు చెప్పారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్వహణ, పార్కింగ్ సమస్యల కారణంగా తిరుచానూరు స్టేషన్ నుంచి ప్రత్యేక రైళ్లతోపాటు ప్యాసింజర్లను నడపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని తెలిపారు. ఇప్పటికే ఐదు ప్రత్యేక రైళ్లను ఈ స్టేషన్ నుంచి నడుపుతున్నామని, మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెన్నై, అరక్కోణం వరకు మెము రైళ్లను రోజూ నడుపుతున్నామని తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సీసీఐ చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాస్, రాజేంద్ర పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో
విరిగిన వేప చెట్టు కొమ్మ

● భక్తులకు తప్పిన ప్రమాదం



కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన చెట్టు కొమ్మ

చంద్రగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని భారీ వేప చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగిపడింది. అయితే భక్తులకు ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వేపచెట్టు బాగా తడిసింది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ధ్వజస్తంభం నుంచి బలిపీఠం వరకు విస్తరించి ఉన్న భారీ వేపకొమ్మ విరిగి పడింది. దీంతో ఆలయ ఆవరణలోని విద్యుత్ తీగలు, ఇనుప పైపులు, పందిరిపై పడటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఘటన జరిగిన సమయంలో భక్తుల రద్దీ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. తక్షణమే అధికారులు, సిబ్బంది విరిగిన కొమ్మలను తొలగించారు.

దూరవిద్య ఉద్యోగి మృతి



మునిశేఖర్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ ఉద్యోగి మునిశేఖర్ (40) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లె పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన మునిశేఖర్ 20 ఏళ్లుగా ఎస్వీయూలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మునిశేఖర్ మృతికి దూరవిద్య ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

'సీఎంఆర్' అగ్నికీలలు

● షార్ట్‌సర్క్యూట్‌తో ఆయిల్ పైపు అంటుకోవడంతో ప్రమాదం

● మూడు గంటల పాటు అదుపులోకిరాని మంటలు ● అస్వస్థతకు గురైన పలువురు కార్మికులు





సీఎంఆర్ కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు, అలుముకున్న పొగ - కంపెనీలో ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

ఏర్పేడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంచింతపాళెం రెవెన్యూ పరిధిలోని సీఎంఆర్ అల్యూమినియం ఈకో కంపెనీలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆయిల్‌పైపు లీకు కావడం.. షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఆ ఆయిల్ అంటుకొని మంటలు చెలరేగినట్లు పరిశ్రమ వర్గాలు, అధికారులు చెబుతున్నారు. ఈ మంటలను గుర్తించి కార్మికులు బయటకు పరుగుతీశారు. అప్పటికే దట్టంగా పొగ అలుముకోవడంతో ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిపడి కొందరు అస్వస్థతకు గురయ్యారు. వీరిని తిరుపతి, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు తరలించారు. మరోవైపు పరిశ్రమంలోని ఇంజన్ల ద్వారా మంటలను అదుపుచేసేందుకు యత్నించినా సాధ్యపడలేదు. దీంతో 112కు ఫోన్ చేసి కంపెనీ



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

అధికారులు తిరుపతి, వెంకటగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి ఫైర్‌ఇంజన్లను రప్పించారు. సుమారు మూడు గంటల పాటు కష్టపడి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో చింతపాళెం, రాజులపాళెం గ్రామాల్లోనూ పొగ అలుముకుంది. వెంకటగిరికి వెళ్లే వాహనదారులూ ఇబ్బంది పడ్డారు. మరోవైపు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టారు.

అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం

ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమ లోపల 300 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లారు. సాయంత్రం ఐదున్నర గంటలకు బయటకు రావాలి. 5 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. అందరూ అప్రమత్తమై బయటకు పరుగు తీయడంతో ప్రాణనష్టం తప్పింది.

అట్టహాసంగా 'మోహన మంత్ర'

● ఎంబీయూలో ఆకట్టుకున్న ఈవెంట్లు





చంద్రగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మోహన మంత్ర మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎంబీయూ ప్రో.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంచు విష్ణు మాట్లాడుతూ ఎంబీయూ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం నిర్వహించే మోహన మంత్ర కార్యక్రమం విద్యార్థుల సాంస్కృతిక వేడుక అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడానికే ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్లను ఆయన స్వయంగా వెళ్లి తిలకించారు. కొన్ని ఈవెంట్లలో మంచు విష్ణు పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

ఆకట్టుకున్న ఈవెంట్లు

మోహనమంత్ర కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు టెక్నోహాలిక్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంబెడెడ్ వర్క్‌షాప్, కోడ్ ప్రింట్, లైఫ్ సేవర్, ఈవీ వర్క్‌షాప్‌లు, టెక్ ఎక్స్, ప్రోటోటైప్, ఈవీ ఎక్స్‌క్యూజోనోమిక్స్‌లు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్లలో భాగంగా లెట్స్ నాచో, చికెన్ డిన్నర్(పబ్జీ), కరోకే కెచప్, పుష్ అప్ ఛాలెంజ్, ఎం ప్రాజా ఈవెంట్లు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఫ్రీ ఫైర్, గల్లీ క్రికెట్, మిక్స్ బాస్కెట్ బాల్, ట్రెజర్ హంట్, లక్కీ డ్రా, ఫన్ గేమ్స్, ఫుడ్ ఛాలెంజ్, జార్బింగి బాల్స్ వంటి ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కేరింతల నడుమ మొదటి రోజు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు పాల్గొన్నారు.



డ్రమ్స్ శివమణి కార్యక్రమంలో విద్యార్థుల ఈలలు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు నరసింహయాదవ్, సుగుణమ్మ తదితరులు

జీఎస్టీ 2.0 సేల్స్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన

తిరుచానూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం ప్రదర్శించిన జీఎస్టీ 2.0 సేల్స్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రారంభించారు. రాష్ట్ర జీఎస్టీ శాఖ, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో వంట సామగ్రి, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, కార్లు, స్కూటర్లు, సోలార్ తదితర వస్తువులకు సంబంధించి సుమారు 30స్టాల్స్ ఏర్పాటు చేశారు. తగ్గిన జీఎస్టీ వివరాలను వినియోగదారులకు నిర్వాహకులు వివరించారు. ఈ స్టాల్స్‌ను రీజనల్ జీఎస్టీ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర పరిశీలించారు. తగ్గిన ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్‌రాజు, నాయకులు కేవీ చౌదరి, వాసవి ఏజెన్సీ అధినేత ఏవీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయం పాలకమండలి ప్రమాణ స్వీకారం



చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మనాభరాజు

నాగలాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర ఆలయ పాలక మండలి శుక్రవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో చైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీళపూడికి చెందిన టీడీపీ నేత పద్మనాభరాజు, సభ్యులుగా హంస, శ్రీనివాసులు, జయంతి, నెల్సన్ మండేలా, దేవి, కవిత, హేమంత్‌కుమార్, నాగభూషణమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా పాలకమండలి నియామకానికి ప్రభుత్వం గురువారం రాత్రి జీవో విడుదల చేయగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఈవోకు ఉత్తర్వులు అందాయి. గంటల వ్యవధిలోనే సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సత్యవేడు మండలానికి చెందిన కృష్ణయ్య యాదవ్ పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈయన చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మాజీ ఎంపీపీ మధుబాల, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సతీష్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జయచంద్రనాయుడు, నాయకులు బాలరాజు, రామకృష్ణమరాజు, బుజ్జినాయుడు, రామచంద్రరాజు, దుష్యంతరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సన్నిధిలో నూతన పాలక మండలి సభ్యులు

మద్యం తాగి వాహనం నడిపిన
ఒకరికి జైలు శిక్ష

● 15 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. మరో 15 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

రిటైర్డ్ తహసీల్దారుపై
లోకాయుక్తలో కేసు

బాలాయపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిబంధలనకు విరుద్ధంగా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసిన రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు నమోదైంది. 2019 అక్టోబరులో బాలాయపల్లి తహసీల్దారుగా నియమితులైన ఆదిశేషయ్య 18 నెలల పాటు ఆ మండలంలో విధులు నిర్వహించారు. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రామాపురం గ్రామంలోని ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామస్తులు 2023లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం రిటైర్డ్ అయిన తహసీల్దారు ఆదిశేషయ్యపై 1644/2023/బి1 నంబరుతో కేసు నమోదు చేసిన లోకాయుక్త విచారణకు ఆదేశించింది. ఇందుకోసం జాయింట్ కలెక్టర్‌ను విచారణాధికారిగా, గూడూరు ఆర్డీవోను రికార్డుల పరిశీలనకు ప్రజెంటేషన్ అధికారిగా నియమించింది.

హత్య కేసులో నిందితుడికి
ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్/ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ తీర్పునిచ్చారు. ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన వీరాస్వామి, పోలయ్య పొలం హద్దుల విషయమై 2017 ఏప్రిల్ 10వ తేదీన గొడవ పడ్డారు. ఈ క్రమంలో పోలయ్యపై వీరాస్వామితో పాటు గ్రామానికి చెందిన 9మంది కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆస్పత్రిలో పోలయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరాస్వామిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ సుందరయ్య వాదించారు.

గువ్వల కాలనీలో యువకుడి హత్య



మెడపైన రక్తగాయంతో చికిత్స పొందుతున్న శ్రీహరి (చనిపోయేముందు)

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్ర జ్యోతి): గువ్వల కాలనీలో యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. గువ్వల కాలనీలో ఉంటున్న ఓ మేస్త్రీ తన భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. స్థానికంగా ఉన్న కొంతమంది మేస్త్రీ పట్ల అవహేళనగా మాట్లాడడంపై మూడు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం పక్కింటి వారితో మద్యం మత్తులో మేస్త్రీ ఘర్షణపడ్డాడు. ఆ సమయంలో మేస్త్రీని అడ్డుకునే క్రమంలో శ్రీహరి(16) ప్రయత్నించాడు. దీంతో పూసలు చుట్టే కత్తితో మేస్త్రీ అతడి మెడపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన శ్రీహరిని చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేశారు.

అన్నప్రసాదం ట్రస్టుకు
రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దర్శన్

తిరుమల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది.టీటీడీ బోర్డు సభ్యుడు దర్శన్ ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని తిరుపతిలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సీజేపై చెప్పు దాడి ఘటనకు.. మోదీ బాధ్యత తీసుకోవాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితులపై దాడులు పెరిగాయని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు దాడి జరిగిందని, వీటికి ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సీజేపై చెప్పు దాడి, హరియాణాలో ఎస్పీ డీజీపీపై అక్కడి బీజేపీ ప్రభుత్వం వేధింపులకు నిరసనగా ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి తిరుపతి ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. చింతా మాట్లాడుతూ సీజేపై చెప్పు దాడి ఘటనకు ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. మన రాష్ట్రానికి చెందిన ఒక దళిత డీజీపీ హర్యానాలో అక్కడి ప్రభుత్వం పెట్టిన వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మన రాష్ట్రంలోనూ దళితులపై, దళిత అధికారులపై దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. వీటిని కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపిగౌడ్, రవి, రావణ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలుపుతున్న చింతా మోహన్

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



ర్యాలీలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, జీఎస్టీ అధికారులు, వ్యాపారులు

గూడూరు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎస్ రాయులు కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఎలక్ట్రానిక్ సెల్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యాపారులు న్యాయబద్ధంగా ధరలను స్థిరీకరించాలని సూచించారు. అంతకుముందు స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంటేశ్వర్లు, కోట సునీల్‌కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, జీ.చంద్రశేఖర్, సుధాకర్, వెంకటసుబ్బయ్య, కేవీ భాస్కర్, సుబ్బయ్య, ప్రసాద్, శ్రీధర్, పెద్దసంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకూడదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ భాస్కర్

సూళ్లూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకూడదని చిత్తూరు మెడికల్ కళాశాలకు చెందిన ప్రముఖ మానసిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎస్.భాస్కర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యాపరమైన మానసిక ఒత్తిళ్లు వచ్చినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఒత్తిళ్లకు గురై జీవితాన్ని బలిచేసుకుంటార న్నారు. పిల్లలు మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ కార్యదర్శి డాక్టర్ ఆదిశేషారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు లలిత, అరుణాకుమారి, సభ్యులు జానకి, అప్పారావు, ఆదినారాయణరెడ్డి, లలితా రెడ్డి, అంకుల్‌రావు, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామంతో మానసిక వైకల్యాన్ని జయించొచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేష్

గూడూరు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంలో బాధపడేవారు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే త్వరగా కోలుకుంటారని గూడూరు సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక బాధితులతో నిత్యం వ్యాయామం చేయించడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్ హార్మోన్ ఉత్పత్తి పెరిగి మెదడు ఉత్తేజితమవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్, సీనియర్ న్యాయవాది గోపికృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు కోటేశ్వరరావు, ఎస్‌ఐ తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

దామానెల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి



సూళ్లూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దామానెల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షుడిగా గాడి నారాయణరెడ్డిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, డైరెక్టర్లుగా దామానెల్లూరుకు చెందిన పుట్టు విజయ రాఘవులు, మంగళంపాడుకు చెందిన ఇల్లి ధనపాల్‌ను నియమించారు.

ఉత్తమ పంచాయతీలకు కేంద్రం ప్రోత్సాహకాలు

డక్కిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం గ్రేడును బట్టి రూ.కోటి వరకు నగదు అందజేస్తుందని ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో జరిగే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఆన్‌లైన్‌లో రేటింగ్‌లు విధిగా నమోదు చేయాలని సూచించారు. ఉత్తమ రేటింగ్‌లో సాధించిన పంచాయతీలకు గ్రేడ్‌ను బట్టి రూ.కోటి వరకు నగదు బహుమతులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య, తాగునీరు, పారిశుధ్యం, వృత్తి శిక్షణ, డిజిటల్ సేవలు, జీవన ప్రమాణాలు వంటి విభాగాల్లో పనితీరును అంచనా వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌వో వెంకటయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎంలు, పీడీలు

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికలకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వీరు ఈనెల 20వ తేదీన నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీవైఈవో సనత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రబాబు, కాంచన, హెచ్‌ఎంలు భారతి, సుధారాణి, డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, పీడీలు సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రావు, భాస్కర్, సురేష్‌బాబు, రమేష్‌బాబు, శ్రీను, కరిముల్లాఖాన్ పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ

ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని పంచాయతీల పురోగతి సూచికపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల్లో ప్రజల శ్రేయస్సుతో పాటు తొమ్మిది విషయాల ఆధారంగా అభివృద్ధి స్థితిని అంచనా వేయడం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. ఎంపీపీ అరుణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఒకరి మృతి
ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామానికి చెందిన సురేష్, ఆయన భార్య కళావతి, సమీప బంధువు లలితమ్మల మనుబోలు మండలం పిడూరు గ్రామంలోని జామాయిల్ తోటలో కూలి పనులకు రెండు రోజుల క్రితం వెళ్లారు. గురువారం రాత్రి తిరిగి స్వగ్రామానికి ఆటోలో వస్తుండగా నరసారెడ్డికండ్రిగ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కళావతి తీవ్రంగా గాయపడగా, సురేష్, లలితమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కళావతి(29) పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

కోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని గూడూరు డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం రాత్రి ఆమె కోట పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ పవన్‌కుమార్ ఉన్నారు.





తవ్వకాలు చేస్తున్న గ్యాస్ పైపులైన్ నిర్వాహకులు - మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న ట్యాంకర్ల నుంచి తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

గ్యాస్ పైపులైన్ కోసం అడ్డగోలు తవ్వకాలు

మంచినీటి పైపులైన్ల ధ్వంసం ● సరఫరాలో ఇబ్బందులు

నాయుడుపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్యాస్ పైపులైన్ కోసం అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతుండడంతో రోడ్లు దెబ్బతినడంతో పాటు తాగునీటి పైపులు ధ్వంసం అవుతున్నాయి. కొంతకాలంగా మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో గ్యాస్ పైపులైన్ కోసం ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లను తవ్వేస్తున్నారు. దీంతో రోడ్లు ధ్వంసం కావడంతో పాటు తాగునీటి పైపులు పగిలిపోతున్నాయి. రెండు రోజుల క్రితం స్థానిక పొగగొట్టంకాలనీలో గ్యాస్ పైపులైన్ కోసం చేపట్టిన తవ్వకాలతో తాగునీటి పైపులు ధ్వంసమయ్యాయి. తాగునీటి సరఫరా ఆగిపోవడంతో మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లను బాగు చేయడంతో పాటు తాగునీటి పైపులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరినా పట్టించుకోవడంలేదు. నిబంధనల ప్రకారం ఒక ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి, అక్కడ మరమ్మతులు పూర్తయిన తరువాత మరొక ప్రాంతంలో తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అయితే నిబంధనలు పాటించకుండా తవ్వకాలు చేపడుతూనే ఉన్నారు. దీంతో అనేకచోట్ల పైపులైన్లు ధ్వంసం కావడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ మున్సిపాలిటీలో గ్యాస్ పైపులైన్ తవ్వకాలకు అనుమతులు లేవని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు.

జీఎస్టీ 2.0తో అన్ని వర్గాలకు ప్రయోజనం: విజయశ్రీ



జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతకు మునుపు 5, 12, 18, 28 శాతం జీఎస్టీ శ్లాబులు ఉండగా గత నెల 22 నుంచి 5, 18 శాతం అమల్లోకి వచ్చాయన్నారని తెలిపారు. ఈ సంస్కరణల ద్వారా కొన్ని వస్తువులపై పన్ను పూర్తి రద్దు చేయగా, మరి కొన్నింటిపై తగ్గించారన్నారు. సంబంధిత అధికారులు జీఎస్టీ కొత్త విధానంపై వ్యాపార వర్గాలకు, కొనుగోలు దారులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు మాట్లాడుతూ నూతన జీఎస్టీ విధానాన్ని వ్యాపారస్తులు తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం వ్యాపారులు ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ తదితర వస్తువులను ఎమ్మెల్యే అధికారులు పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. ముందుగా ఎమ్మెల్యేను వ్యాపారులు, జీఎస్టీ అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, జీఎస్టీ అధికారి నరసింహులు, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బాలాంజనేయస్వామి దేవస్థాన చైర్మన్ వాకచర్ల రమేష్, వాకచర్ల శాంతారావు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రాయులు గుంటకు హద్దుల ఏర్పాటు

పెళ్లకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లగా వివాదాస్పదంగా మారిన వెంకట్రాయులు గుంటకు శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. మండలంలోని అనకవోలు పంచాయతీ పెరుమాళ్లపల్లి గ్రామంలోని వెంకట్రాయులుగుంటకు సమీపంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వట్టికుండల శేఖర్‌నాయుడుకు చెందిన 12 ఎకరాల భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భూములు వెంకట్రాయులు గుంటకు సంబంధించినవని, సాగుచేయడానికి వీలులేదంటూ కొంతమంది అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తన భూములను సర్వే చేసి ఇవ్వాలని శేఖర్‌నాయుడు అధికారులను కోరారు. దీంతో శుక్రవారం సర్వే చేపట్టి వెంకట్రాయులుగుంట 9.68ఎకరాల్లో విస్తరించి ఉందని నిర్ధారించారు. హద్దుల మేరకు చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ తీశారు. ఈ క్రమంలో వెంకట్రాయులుగుంట విస్తీర్ణం ఇంకా ఎక్కువ ఉందంటూ గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అధికారులకు గ్రామస్తులకు వాగ్వాదం జరిగింది. ఇరిగేషన్ డీఈ విశ్వనాథ్, ఏఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు గ్రామస్తులకు సర్దిచెప్పి రికార్డుల ప్రకారం హద్దులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషీ బాయి, వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ సుప్రజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడు, వజ్జావారిపాళెం, కరబల్లవోలు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.

తడ: సూళ్లూరుపేట, మన్నెముత్తేరి, తడ, బీవీపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శేఖర్ తెలిపారు.

గూడూరు: పట్టణంలోని 133 కేవీ సబ్‌స్టేషన్, లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ప్రసాద్ తెలిపారు.

కోట: మండలంలోని కోట, కొత్తపాళెం, వంజివాక, సిద్దవరం, ఉత్తమనెల్లూరు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అనంతరావు తెలిపారు.

డక్కిలి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అశోక్ తెలిపారు.

మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ

ఓజిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు పెరటి కోళ్లు అందజేశారు. ఓజిలి మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ, తహసీల్దారు పద్మావతి, ఏపీఎం పద్మమ్మ, సీసీ సుభాషిణి, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, జిల్లా బీసీసెల్, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కే ఖలీల్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి

తడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతులపై ప్రతి అధికారి దృష్టి పెట్టాలని ఎంపీడీవో శేఖర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు శరత్‌బాబుతో కలసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వో వాటర్ అందించడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈవో వేములు, పంచాయతీ కార్యదర్శులు శేషారావు, గాబ్రియల్, మస్తాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

బాలాయపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యనిపుణులచే ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 122 మందికి కంటి పరీక్షలు చేశారు. 73 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లంటి కృష్ణయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు దొమ్మరాజు ప్రశాంతిరాజు, కొండూరు సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చెంచుమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

పెళ్లకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామాల సమీపంలో వెలసిన నరసింహస్వామి సమేత చెంచు మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ పురోహితులు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో హోమం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకించారు. అమ్మవారికి చందనాలంకారం చేశారు. చిల్లకూరు సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, ప్రవీణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు



టపాసుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు జయజయరావు, అగ్నిమాపక శాఖ అధికారులు

కోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాదారులు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని తహసీల్దారు జయజయరావు హెచ్చరించారు. మండల పరిధిలోని చెందోడు, వెంకన్నపాళెం గ్రామాల్లో ఉన్న బాణసంచా దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు ఆరా తీశారు. విద్యుత్ సరఫరా ఆగిపోయినప్పుడు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రొటోకాల్ విధులకు తహసీల్దార్లు

తడ/డక్కిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తడ తహసీల్దారు శరత్‌బాబు, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు వారం రోజుల పాటు డిప్యుటేషన్‌పై కర్నూలుకు వెళ్తున్నారు. ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో వీరికి కర్నూలులో ప్రొటోకాల్ విధులు కేటాయించారు. వీరు తిరిగి వచ్చే వరకు తడకు సూళ్లూరుపేట తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి, డక్కిలికి వెంకటగిరి తహసీల్దార్ నరిసింహరావులకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఉత్తర కొరియా, హైదరాబాదు, ఒంగోలులో ఉన్న స్నోవాసిస్ కంపెనీ బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సీఎస్‌సీ, ఈసీఈ, ఐటీఐ, ఎఐడీఎస్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. 430 మంది విద్యార్థులు పాల్గొనగా మొదటి రౌండ్‌లో 76 మంది, రెండవ రౌండ్‌లో 14 మంది ఎంపికయ్యారు. వారికి టెక్నికల్, ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ కిషాంధర్, కంపెనీ ప్రతినిధులు కిషోర్, సుధీర్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి గర్హనీయం

గూడూరు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి గర్హనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈనెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దేవదాసు కోరారు. అలాగే 15న అన్ని మండల కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతామన్నారు.

మానసిక వికలాంగులకు వరం.. భవిత కేంద్రాలు

వెంకటగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగులకు భవిత కేంద్రాలు వరంలాటివని ప్రముఖ న్యాయవాది గాంధీ అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవం జరిగింది. నిర్వాహకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతోందన్నారు.

రూ.34 కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి



సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, రవి, వైస్ చైర్మన్ రఫీ తదితరులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలను రూ.34 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం నాయుడుపేట పాత బీడీ కాలనీలో రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.18 కోట్లు, నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.16 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, నాయకులు పసల గంగాప్రసాద్, అవధానం సుధీర్, జయరాం, నసీం, అశోక్, హరనాథ్‌రెడ్డి, సుజాత, రేవతి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయండి



ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నీరజ

చిల్లకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు సమీపంలో ఉన్న ఏఎంసీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్ పర్సన్‌గా చిల్లకూరు నీరజమ్మ, వైస్ చైర్మన్‌గా సోమిశెట్టి చెంచు రామయ్యతో పాటు డైరెక్టర్లుగా పెజ్జాయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నెల్లటూరు సుప్రజ, వేముల సునీల్, జాకీర్, కిషోర్, కృష్ణయ్య, శ్యామల, పర్వీన్, ప్రకాష్ నాయుడు, సుధా, కృష్ణమ్మ, నిర్మలమ్మ, మల్లికార్జున్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, తీగల చంద్రశేఖర్, మస్తాన్‌నాయుడు, రాజేంద్ర, వేముల సునీల్ పాల్గొన్నారు.

ఆవిష్కార్ సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఆవిష్కార్ 2కె25 జాతీయస్థాయి సదస్సును కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.







నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలోని నందగోకులం స్కూల్‌తో పాటు పలు సంస్థలను ప్రారంభించేందుకు శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.